

## జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రియాంక
### మర్యాదపూర్వకంగా సిఎంను కలిసిన కలెక్టర్

**హైదరాబాద్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :**
హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా ప్రియాంక ఆల ఆదివారం ఉదయం లక్డీకాపూల్‌లోని జిల్లా కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. జిహెచ్ఎంసి ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన ప్రియాంక ఆలను రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్‌గా నియమించింది. ఈ సందర్భంగా నూతన కలెక్టర్‌ను జిల్లా ఉన్నతాధికారులు ఘనంగా స్వాగతంపలికి అభినందనలు తెలిపారు. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా, ఇక్కడ కలెక్టర్‌గా విధులు నిర్వహించిన హరిచందన దాసరిని ఎల్ఈటీ అండ్ ఎఫ్ డిపార్టుమెంట్ సెక్రటరీగా బదిలీ చేశారు.

సిఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేస్తున్న నూతన జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల



# హైదరాబాద్ వార్త

# బహుళ అంతస్థుల భవనాలు సరే..

* మౌలిక సదుపాయాల మాటేంటి ?
* నగరంలో ఇష్టారాజ్యాంగా భవనాలకు అనుమతులు
* 50 అంతస్తులకుపైగా అనుమతులు



**హైదరాబాద్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:**
హైదరాబాద్ మహానగరంలో బహుళ అంతస్థుల (హైరైజ్డ్) భవనాలకు ఇష్టారాజ్యాంగా అనుతులు ఇస్తున్నారు. స్థానికంగా ఉన్న పరిస్థితులను ఏ మాత్రం పరిగణలోకి తీసుకోవడం లేదు. నగరం నడిబొడ్డును ఒక్కొక్క ప్రాంతంలో 50 అంతస్థులకు పైగా అనుమతులను ఇస్తున్నారు. అసలే నగరంలో ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఈ బహుళ అంతస్థుల కారణంగా మరింత సమస్యలు తప్పేలా లేవు. ఇప్పటికే హైటెక్ సిటీ, నార్సింగ్, కోకాపేట, గచ్చిబౌలి, నానక్‌రాంగూడ తదితర ప్రాంతాలలో బహుళ అంతస్థుల భవనాల కారణంగా చాలా ఇబ్బందులు ప్రజలు ఎదుర్కొంటున్నారు. గంటల తరబడి ప్రజలు ట్రాఫిక్‌లో వేచిచూడాల్సిన దుస్థితులు నెలకొన్నాయి. శివారు ప్రాంతాలకు పరిమితమైన బహుళ అంతస్థుల భవనాలు నగరం నడిబొడ్డున ఇవ్వడంతో రానున్న రోజులో ప్రజలకు కష్టాలు తప్పేలా లేవు. బంజారాహిల్స్, జుబ్లిహిల్స్‌లతో పాటు ఆర్‌టిసి క్రాస్‌లోనూ 56 అంతస్థుల భవనాలకు అనుమతులు ఇవ్వడం చర్చనీయాశంగా మారింది. ఇప్పటికే ఆర్‌టిసి క్రాస్‌రోడ్డులో రెండు పెద్ద మాల్స్‌ల నిర్మాణాలు పూర్తయ్యాయి. దీనికి తోడు ఈ బహుళ అంతస్థుల భవనం కారణంగా మరింత ఇబ్బందులు తప్పేల లేదు. కాగా నగరంలో భవనాలకు అనుమతులు ఇస్తున్న అధికారులు స్థానికంగా ఉన్న సమస్యలను పరిగణలోకి తీసుకోవడం లేదు. భవనాలకు, మాల్స్‌లకు అనుమతులు సరే.... కానీ క్షత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. రహదారులు, డ్రైనేజీ, మంచినీటి, ఫైర్ తదితర సౌకర్యాల విషయంలో దృష్టిసారించాల్సిన అధికారులు వాటిని పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా రహదాలను విస్తరించకపోతే ట్రాఫిక్ సమస్యతో రోడ్లపైనే గంటల తరబడి వేచి చూడాల్సిన దుస్థితులు నెలకొంటున్నాయి. రానున్న పది, పదిహేను సంవత్సరాల ట్రాఫిక్, డ్రైనేజీ, మంచినీటి తదితర సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని కనీస మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన బాధ్యత ఉంది. కానీ అవేవి తమకు సంబంధం లేదన్నట్లు భవనాలకు అనుమతులను ఇస్తున్నారు. మరోవైపు బహుళ అంతస్థుల భవనాలను నిర్మాణ సమయం మొదలు పూర్తయ్యే వరకు క్షేత్రస్థాయిలో అధికారులు తనిఖీలు చేయాల్సి ఉంటుంది. కానీ అధికారులు తనిఖీలు చేయడం లేదు. కేవలం బిల్డర్ పైనే ఆధారపడుతున్నారు. సదరు బిల్డర్ ఎలా చెప్తే అలా అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. అనుకోని సంఘటనలు జరిగినప్పుడు హడావుడి చేసే ఉన్నత స్థాయి అధికారులు, ప్రారంభ సమయంలో ఎందుకు తనిఖీలు చేయడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఒక్కొక్క చోట 50, 60,70 అంతస్థుల భవనాలకు అనుమతులు ఇస్తున్న అధికారులు స్థానికంగాఉన్న పరిస్థితులను పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బహుళ అంతస్థుల భవనదారులే కాకుండా మిగిలిన ప్రజల అవసరాలు, వారి మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన అవసరం ఉంది. అధికారుల ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా భవిష్యత్తులో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తప్పవు.

# అసలు ధరపై స్టిక్కర్లు..!



* రేట్లు తుడ్చేస్తున్నారు..దోచేస్తున్నారు
* షాపింగ్ మాల్స్‌లో వ్యాపారుల ఇష్టారాజ్యం
* బార్‌కోడ్‌పేరుతో అసలు ధరపై స్టిక్కర్లు
* అధిక ధరలతో వినియోగదారుల దోపిడీ
* "మామూళ్లు"గా తీసుకుంటున్న తూనికలు కొలతలశాఖ

**హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
నగరంలో షాపింగ్ చేయడమంటే వినియోగదారులు బెంబేలెత్తాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. పైకి హంగూ ఆర్భాటాలతో ఆకర్షణీయంగా ఉండే ఈ షాపింగ్‌మాల్స్‌లో లోపలికి వెళ్లిన కస్టమర్లను నిలువు దోపిడీ చేస్తున్నారు. కళ్లు చెదిరే లైట్లతో, ఆకర్షనీయమైన డిస్‌ప్లేవెనుక జరిగేదంతా మోసమే. షాపింగ్ మాల్ సోకు చూసి లోపలి కెళ్లామా మనం అడ్డంగా బుక్కయిపోవడం ఖాయం. ఆఫర్ల పేరుతో వినియోగదారులను ఆకట్టుకునే షాపింగ్ మాల్స్ తూనికలు-కొలతలు నాణ్యత విషయంలో మాత్రం కష్టమర్లను మోసగిస్తున్నాయి. ప్రతి షాపింగ్ మాల్‌లోనూ ఏ వస్తువైనా నిర్ధేశించిన ధరకన్నా ఎక్కువ అమ్మరాదన్న నియమం ఉంది. కానీ ఈబడా షాపింగ్‌మాల్స్‌లో ఆ నియమాలకు తిలోదకాలిచ్చి ఎమ్మార్పీ కంటే ఎక్కువ రేటుకే అమ్ముతున్నారు. తాజాగా జుబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 36లోని ఓస్టోర్‌లో మోసం జరిగింది. వినియోగదారుడు తెలిపిన వివరాల ప్రకారం తాను కొనుగోలు చేసిన హెయిర్‌డ్రై పై కంపెనీ నిర్ణయించి ముద్రించిన ధర రూ. 349 ఉంటే...స్టోర్ నిర్వాహకులు దానిపై బార్‌కోర్డు పేరుతో రూ.499 విక్రయించారని, స్టిక్కర్ తీసేసి వారిని ప్రశ్నిస్తే వాగ్వాదానికి దిగారని తెలిపారు. ఇలాంటి మోసాలకు పాల్పడుతున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలా హైదరాబాద్‌లో నలుమూలలా పెరుగుతున్న ప్రజల అవసరాలకు అనుగుణంగా షాపింగ్‌మాల్స్ వెలుస్తున్నాయి. అందులోనూ అనేక కంపెనీలు ఈవ్యాపారంలోకి దిగడం వాటి మధ్య పోటీ పెరగడంతో మోసాలకు ఊతమిస్తున్నాయి. తూనికలు కొలతలు అధికారులు ఈషాపులపై దాడిచేసి చర్యలు తీసుకున్నా..వినియోగదారులు కూడా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని ఈ పరిస్థితులు తెలియజేసునాయి.

**అసలు ధరపై స్టిక్కర్లు...**
నగర జనం ఎక్కువగా వస్త్రాల కొనుగోలుకు గానీ, ఇంట్లోకి కావాల్సిన పదార్థాలను షాపింగ్ మాల్స్‌లోనే కొనుగోలు చేయడానికి ఇష్టపడతారు. దీనిని ఆసరాగా చేసుకుంటున్న వ్యాపారులు తమ ఇష్టానుసారంగా అనుకూలమైన రేట్లతో స్టిక్కర్లను ముద్రించి అధిక ధరలకు అమ్ముతున్నారు. కేవలం షాపింగ్ మాల్స్‌లోనే కాకుండా పెద్దపెద్ద సినీమాల్స్, క్లాత్,డ్రెస్ షారూంలలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. గతేడాది ఇదేనెలలో తూనికలు కొలతలశాఖ అధికారులు షాపింగ్ మాల్స్ థియేటర్లపై విస్తృత దాడులు నిర్వహించి వందలాది కేసులు నమోదు చేశారు. దీంతో కొంతకాలం ఈ అక్రమాలకు తెరపడింది. తర్వాత తూనికలు కొలతల శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో మళ్లీ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. అంతేకాకుండా వినియోగదారుడికి జీఎస్టీపై పూర్తిగా అవగాహన లేకపోడం, తెలిసిన వారు ప్రశ్నించకపోవడంతో వ్యాపారుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతుంది.

**ప్యాకింగ్ నిబంధనలు...**
ప్యాకేజ్డ్ కమోడిటీస్ నిబంధనల ప్రకారం ప్రతి ప్యాకెజ్‌పై తయారీదారుడి పేరు, చిరునామా, ఎప్పుడు తయారు చేశారు? వస్తువు పేరు, నికర బరువు, అన్ని పన్నులతో కలిపి ఎమ్మార్పీ, వినియోగదారుల సహాయ కేంద్రం ఫోన్‌నంబర్ తదితర వివరాలు ముద్రించాల్సి ఉంటుంది. వీటిలో ఏ ఒక్కదాన్ని ముద్రించకపోయినా అది ఉల్లంఘన కిందకే వస్తుంది. అయితే కొన్ని షాపింగ్ మాల్స్‌లో మాత్రం ఈ నిబంధనలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. కొన్ని మాల్స్‌లో భూతద్దం పెట్టి వెతికినా ఈ సమాచారం కనిపించడం లేదు. కేవలం ఎమ్మార్పీతో కూడిన స్టిక్కర్లను మాత్రమే అంటించి అమ్మకాలు జరుపుతున్నారు. అయితే మాల్స్‌లో వస్తువులను కొనేందుకు వెళ్లే వినియోగదారులు తాము కొనుగోలు చేసే వస్తువుపై ప్యాకింగ్ నిబంధనల ప్రకారం ముద్రించి ఉన్నాయో లేదో గమనించాలని ఎటువంటి అనుమానం కలిగినా తమదృష్టికి తీసుకురావాలని తూనికలు కొలతలు అధికారులు తెలుపుతున్నారు.

### మొబైల్ చూస్తోందని తండ్రి మందలించాడని
## మనస్తాపానికి గురై బాలిక ఆత్మహత్యాయత్నం

**హైదరాబాద్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :** నేటి డిజిటల్ యుగంలో సెల్‌ఫోన్ వాడకం ప్రాణాంతకంగా మారుతోంది. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు స్మార్ట్ ఫోన్లకు బానిసలవుతున్నారు. తాజాగా అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఒక ఘటన తల్లిదండ్రులను ఆందోళనకు గురి చేస్తోంది. అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 14 ఏళ్ల బాలిక నిత్యం మొబైల్ ఫోన్ చూసేది. చదువును పక్కన పెట్టి ఫోన్‌లోనే కాలక్షేపం చేస్తోండటంతో.. ఈ విషయాన్ని గమనించిన తల్లిదండ్రులు ఆమెను మందలించారు. తరచుగా మొబైల్ చూడటంవల్ల కళ్లు దెబ్బతింటాయని, చదువు పాడవుతుందని తండ్రి కాస్త గట్టిగానే హెచ్చరించారు. దీంతో తల్లిదండ్రులు తనను అందరిముందు తిట్టారని సదరు బాలిక తీవ్ర మనస్తాపానికి గురైంది. ఇంట్లో ఎవరూలేని సమయం చూసి, తన గదిలోకి వెళ్లి తలుపు వేసుకుంది. లోపల ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించింది. కాసేపటి తర్వాత గమనించిన కుటుంబ సభ్యులు తలుపులు బద్దలుకొట్టి చూడగా, బాలిక ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. వెంటనే ఆమెను కిందకుదించి చికిత్స నిమిత్తం సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలిక పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కూతురు చిన్న విషయానికే ఇంత పెద్ద తొందరపాటు నిర్ణయం తీసుకుంటుందని ఊహించని తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. అత్తాపూర్‌లో జరిగిన ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 449 మందిపై కేసులు

**హైదరాబాద్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :** రహదారి భద్రతను మెరుగుపరచడంలో భాగంగా ట్రాఫిక్ పోలీసులు రెండు రోజుల పాటు మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈనెల 24, 25వ తేదీలలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న 449 మందిపై కేసులు నమోదు చేసి చేశారు. వాహనాల వారీగా ద్విచక్ర వాహనాలు 371, త్రిచక్ర వాహనాలు 30, నాలుగు చక్రాల మరియు ఇతర వాహనాలు 48 వరకు ఉన్నాయి. "మద్యం సేవించి వాహనాలు నడిపితే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, ఈ ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు. నగర ప్రయాణీకులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు.

## పెట్టుబడి డబ్బులు అడిగినందుకు బెదిరింపులు

**జూబ్లీహిల్స్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** పెట్టుబడి పెట్టిన డబ్బులు అడిగినందుకు గుంపుగా వచ్చి బెదిరింపులకు పాల్పడిన సంఘటన బంజారాహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. టోలిచౌకికి చెందిన సయ్యద్ ఖాలిద్ 2024లో బంజారాహిల్స్‌లోని ఒక ఆస్థికి సంబంధించి మార్ట్‌గేజ్ చేయించుకున్నారు. స్థలాభివృద్ధికి పెట్టుబడిగా రూ. 1.5 కోట్లు పెట్టాడు. డబ్బులు ఇచ్చిన అనంతరం అతన్ని అందులో నుంచి తొలగించేందుకు ఆస్రా సుల్తానా, మహ్మద్ జకీరుద్దీన్, మహమ్మద్ అతుల్లా సిద్దిఖి బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు తెలిసిన వారి ద్వారా న్యాయవాది మహ్మద్ రఫీయుద్దీన్‌ను కలవగా అసలు పత్రాలు, ఖాళీ పత్రాలపై సంతకాలు చేయించుకొని వాటిని దుర్వినియోగంచేసి తప్పుడు కేసులు నమోదు చేశారని ఖాలిద్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పత్రాలు తిరిగి ఇవ్వాలంటూ రూ. 1.2 కోట్లు ఇవ్వాలంటూ బెదిరింపులకు పాల్పడ్డారని దీనికితోడు లయీక్ అతని అనుచరులు స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి బెదిరింపులకు పాల్పడినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు లయీక్‌తోపాటు అతని అనుచరులపై బీఎన్ఎస్ సెక్షన్ 329(4), 352, 351(2), 303(2), 324 (4) రోడ్ విత్ 3(5) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎలక్ట్రిక్ బైక్ షోరూంలో షాక్‌కొట్టి ఒకరి మృతి

**జూబ్లీహిల్స్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
ఎలక్ట్రిక్ బైక్ షోరూంలో పని చేస్తున్న ఒక కార్మికుడు వాహన మరమ్మతు సమయంలో షాక్‌కొట్టి మృతి చెందిన సంఘటన బంజారాహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. చంద్రాయణగుట్ట ప్రాంతానికి చెందిన షేక్ అజీమ్(18) శ్రీనగర్‌కాలనీ కమలాపురి కాలనీలోని రామ్ అథర్ షోరూంలో ఎలక్ట్రిక్ వాహన పాలిషింగ్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. కాగా శనివారం రాత్రి ఒక ఎలక్ట్రిక్ బైక్ ప్రెషర్ వాచర్ పెట్టే సమయంలో ఒక్కసారిగా ఎలక్ట్రిక్ షాక్‌కు గురై పడిపోయాడు. దీంవతో అతన్ని వెంటనే సమీపంలోని ఒక ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి సోదరుడు షేక్ అమెర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



హిమాయత్‌సాగర్

## ప్రాణాలు తీసిన ఈత సరదా
### నీట మునిగి ఇద్దరు యువకులు మృతి

**అత్తాపూర్ ఏప్రిల్ 26,ప్రభాతవార్త :** హిమాయత్‌సాగర్‌లో ఈత సరదా ఇద్దరు ప్రాణాలు తీసింది. ఆదివారం సరదాగా గడిపేందుకు వచ్చిన నలుగురు స్నేహితులు నీటిలోకి దిగారు. ఈ క్రమంలో ఇద్దరు యువకులు సాగర్‌లో గల్లంతు అయ్యారు. మిగిలిన ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. స్నేహితులను కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని గజ్జ ఈతగాల సహాయంతో మృతదేహాలను వెలికితీసి విచారణ చేయగా టోలిచౌకి హాకింపేట్ కాలనీకి చెందిన షాబాజ్ (24), రంగారెడ్డి పిరం చెరువుకు చెందిన షేక్‌సల్మాన్(22)లు గుర్తించారు. అనంతరం మృతదేహాలను హాస్పిటల్‌కు తరిలించి ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి, యువకులు అక్కడికి రావడానికి కారణాలేమిటి ప్రమాదం ఎలా జరిగింది అనే అంశాలపై దర్యాప్తు చేపట్టారు.



మంత్రిని సన్మానిస్తున్న ఆర్టీసీ కార్మిక సంఘం నేతలు

## మంత్రి వివేక్‌ను కలిసిన ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు

**జూబ్లీహిల్స్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**
మంత్రి వివేక్ వెంకటస్వామిని ఆదివారం ఆర్టీసీ జేఏసీ నేతలు మంత్రుల ప్రాంగణ సముదాయంలో కలిసి సత్కరించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకొన్న నేపథ్యంలో మంత్రిని కలిశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా ప్రభుత్వం కార్మికుల చిరకాల స్వప్నాన్ని సాకారం చేసిందని కార్మిక సంఘాల నేతలు అన్నారు. సంఘాల ఎన్నికల నిర్వహణ, కార్మికులకు 11 శాతం పీఆర్సీ ప్రకటించడం తదితర కీలక నిర్ణయాలపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మిక సంఘం నేతలు వెంకన్న థామస్‌రెడ్డి, అశ్వద్ధామ రెడ్డి, హనుమంతు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల రహిత సమాజమే లక్ష్యం
### మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :** గుట్కా, పాన్ మసాలా, ఖైనీ, డ్రగ్స్ వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల వాడకం హానికరమని, వీటిని అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం రాయదుర్గంలోని సత్వ నాలెడ్జ్ పార్క్ వద్ద గ్లోబల్ ఓరల్ క్యాన్సర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన నోటి క్యాన్సర్ అవగాహన మరాథాన్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు 10కే రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల దేశంలో నోటి క్యాన్సర్ కేసులు ప్రమాదకరంగా పెరుగుతున్నాయి. ప్రతి సంవత్సరం లక్షలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని యువతను ఉత్సాహపరిచారు. మరోవైపు సైబరాబాద్ సీపీ రమేశ్ 5కే రన్‌ను ప్రారంభించి, శాంతిభద్రతల పరిరక్షణతో పాటూ సామాజిక బాధ్యతగా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు అవసరమని పేర్కొన్నారు. అలాగే డా. వకుళాభరణం కృష్ణ మోహన్ రావు 2కే రన్‌ను ప్రారంభించి, క్యాన్సర్ రహిత సమాజం కోసం వైద్యులు, పౌరులు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

## జనగణనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
### హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ

**చిక్కడపల్లి, ఏప్రిల్ 26 (ప్రభాతవార్త):** దేశాభివృద్ధికి జనగణన అత్యంత కీలకమని, ప్రతి పౌరుడు ఈ ప్రక్రియలో పాల్గొని అధికారులకు ఖచ్చితమైన సమాచారాన్ని అందించాలని హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ పిలుపునిచ్చారు. 2027 జనగణనలో భాగంగా ఆదివారం రాంనగర్‌లో తన నివాసంలో స్వీయ గణన దశను దత్తాత్రేయ లాంఛనంగా ప్రారంభించి ప్రసంగించారు. దేశంలోని ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతులను అంచనా వేయడానికి జనగణన ఒక గొప్ప సాధనమన్నారు. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాల ప్రణాళికలు, సుపరిపాలన మరియు వనరుల సమాన పంపిణీకి ఈ గణాంకాలే పునాది అని పేర్కొన్నారు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు అందాలంటే పౌరుల సహకారం ఎంతో అవసరమని ఆయన ఉద్ఘాటించారు. తెలంగాణ ప్రజలందరూ ఈ జాతీయ యజ్ఞంలో భాగస్వాములు కావాలని, ఎన్యుమరేషన్ అధికారులకు సరైన వివరాలు అందించి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ ప్రవీణ్‌రెడ్డి, ఏఈఆర్‌ఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల డిమాండ్ల సాధనకు కృషి చేస్తా
### ఎమ్మెల్సీ ప్రొ. కోదండరామ్

**కంటోన్మెంట్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఉద్యమాలు చేసిన ఉద్యమ కారుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ తెలిపారు. ఆదివారం తార్నాకలోని ఆయన నివాసంలో తెలంగాణ ఉద్యమ కారుల జేఏసి ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసి టీయూ జేఏసి చేపడుతున్న డిమాండ్ల సాధనకు ఎల్లప్పుడు తన సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో టీయూ జేఏసి నేతలు సుల్తాన్ యాదగిరి, మోత్కుర్ మల్లేశ్,జె.క్రిష్ణ, జి.యాదగిరి, వెంకట్, శివ, శ్రీశైలం, రాజుగౌడ్, కమల, వనజ, మనెమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎమర్జెన్సీ కాకున్నా సైరన్..!

* చిన్నచిన్న కారణాలకే మోగిస్తూ దూసుకెళ్తున్న అంబులెన్స్‌లు * అత్యవసర సమయాల్లోనే సైరన్ వాడాలంటూ సూచన



**హైదరాబాద్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త**
రోగికి అత్యవసర సమయంలో వైద్య సేవలు అందించేందుకు సైరన్‌ను వాడుతూ.. అంబులెన్స్‌లు వేగంగా వెళ్లాల్సిన అవసరం ఉంటుంది. ఆ సమయంలో ట్రాఫిక్ పోలీసులు సైతం రూట్ క్లియర్ ఇస్తుంటారు. అయితే ఇటీవల ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన సర్వేలో చాలా సందర్భాల్లో అత్యవసర సమయం కానప్పుడు కూడా అంబులెన్స్ డ్రైవర్లు సైరన్లు వాడుతూ వెళ్తున్నట్లు గుర్తించారు. చికిత్స అనంతరం రోగిని ఇంటికి తీసుకెళ్లే సమయంలో అనారోగ్యంతో ఉన్న వ్యక్తులు ఉద్యోగులు వివిధ రకాల శాంపిళ్ల కలెక్షన్లు, మృతదేహాలను తరలించేటప్పుడు ఇలా అంబులెన్స్ డ్రైవర్లు సైరన్‌ను ఉపయోగిస్తున్నట్లు తేలింది. అత్యవసర సమయాల్లోనే సైరన్‌ను వాడాలని దుర్వినియోగం చేయవద్దని డ్రైవర్లకు నగర ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు అంబులెన్స్ సర్వీస్‌లకు సంబంధించిన సైరన్‌ను ఎలా వాడుతున్నారు.. దాని దుర్వినియోగంపై ఒక సర్వే చేశారు. అక్కడక్కడ జంక్షన్ల వద్ద 310 అంబులెన్స్ సేవల గురించి ఆరా తీశారు. అందులో అత్యధికంగా 152 అంబులెన్స్‌లు (49శాతం) శాంపిళ్లను తీసుకొని వెళ్తున్నవే ఉన్నాయి. అలాగే వివిధ కారణాలు చెప్పినవి 121 (39శాతం), మృతదేహాలను తీసుకెళ్తున్నవి 20 (6.5శాతం), ఖాళీగా వెళ్తున్నవి 17(5.5శాతం) ఉన్నట్లు తేలింది. ఇలా సగానికి పైగా అంబులెన్స్‌ల సైరన్లు దుర్వినియోగం అవుతున్నట్లు పోలీసులు గుర్తించారు.

రోగికి అత్యవసరంగా వైద్యసేవలు అందించేందుకు సైరన్‌ను వాడుతూ అందరి సహకారంతో అంబులెన్స్‌లు వేగంగా వెళ్లాల్సిన అవసరముంటుంది. అయితే ఆ రోగికి అత్యవసరం కాకున్నా అంబులెన్స్ ఉందంటే సైరన్ వేసుకొని వెళ్లేవారు చాలా మంది ఉంటున్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఎవరైనా ప్రాణాపాయ స్థితిలో ఉంటే.. అప్పుడే పుట్టిన పసిపాపలు..గుండె జబ్బులు, అత్యవసర వైద్యం.. ఇలా కొన్ని సందర్భాల్లో తప్పని సరిగా అంబులెన్స్ సైరన్ వాడాల్సిందేనని పోలీసులు సూచిస్తున్నారు. రోగి చికిత్స అనంతరం అంబులెన్స్‌లో ఇంటికి వెళ్తుండడం, మృతదేహాలను తరలించడం, అనారోగ్యంగా ఉన్న వారిని, ఉద్యోగులు, వివిధ రకాలైన శాంపిళ్లను తీసికెళ్లే సమయంలోనూ అంబులెన్స్ సైరన్‌ను దుర్వినియోగం చేయవద్దని నగర ట్రాఫిక్ అధికారులు సూచనలు చేస్తున్నారు.

**ఒక జంక్షన్ నుంచి 5 నుంచి 6 అంబులెన్స్‌లు..**
అంబులెన్స్ సైరన్‌తో వెళ్తుంటే రోడ్డుపై వెళ్లే వాహనదారులతో పాటు జంక్షన్ల వద్ద పోలీసులు ట్రాఫిక్ క్లియరెన్స్ ఇస్తుంటారు. ఆటోమెటిక్ వ్యవస్థ ఉన్న చోట ట్రాఫిక్ పోలీసులు అప్పటికప్పుడు సిగ్నళ్లను మాన్యువల్‌గా మార్చేసి అంబులెన్స్‌లకు దారిస్తుంటారు. ఇలా ఒక గంటలో ఒక జంక్షన్ నుంచి 5 నుంచి 6 అంబులెన్స్‌లు వెళ్తుంటాయి. ఆ సమయంలో ఆటోమెటిక్ నుంచి మాన్యువల్ మోడ్‌కు సిగ్నల్ వ్యవస్థను మార్చాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే కొన్ని అంబులెన్స్‌లు నాన్ ఎమర్జెన్సీ సందర్భాల్లోనూ సైరన్ మోగిస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు సర్వే ద్వారా గుర్తించారు.

అయితే కొందరు ప్రైవేటు హాస్పిటల్స్ అత్యవసర వైద్య చికిత్స తామే నిర్వహిస్తున్నట్లుగా తమ సొంత ప్రచారం కోసం ట్రాఫిక్ రద్దీ ఉండే ప్రాంతాల్లో తమ అంబు లెన్స్‌లను ఖాళీగా తిప్పుతున్నట్లు తెలుస్తోంది. అంబులెన్స్‌లో రోగులు లేకున్నా.. సైరన్ మోగిస్తూ రద్దీ సమయాల్లో తిప్పుతూ స్వార్థ ప్రచారం పొందుతున్నారు. ఒక కార్పొరేట్ సంస్థ ఇలాగే సైరన్ మోగిస్తూ వాహనదారులను అదరగొడుతూ రద్దీ రోడ్లపై దూసుకెళ్లుండగా చివరకు పోలీసులకు పట్టుపడడం..ఆపై వత్తిళ్లతో తప్పించుకోవడం గమనార్హం.

## ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

**పేట్ బషీరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... జీడిమెట్ల, గోదావరి హోమ్స్ పరిధిలోని సుభాష్‌నగర్‌లో నివసించే కర్వా రాజు(38), ఫ్యాబ్రికేషన్ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆర్థిక ఇబ్బందులతో లోన్ యాప్‌ల ద్వారా సుమారు రూ.7 లక్షల వరకు అప్పు తీసుకుని, వాటిని తిరిగి చెల్లించలేక తీవ్ర ఒత్తిడికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో ఆర్థిక ఒత్తిడిని తట్టుకోలేక ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇదే సమయంలో ఓ కార్యక్రమానికి వెళ్లిన భార్య సాయంత్రం 4 గంటలకు ఇంటికి చేరుకుని చూసే సరికి, అతను ఉరేసుకున్న స్థితిలో మృతిచెందినట్లు గమనించింది. ఈ ఘటనపై పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.



పేరిణి నృత్యం చేస్తున్న విద్యార్థులు

## అన్నమాచార్య సంగీత నృత్యకళాశాల వార్షికోత్సవాలు

**నాంపల్లి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :** ప్రభుత్వ శ్రీఅన్నమాచార్య సంగీత, నృత్యకళాశాల 29వ వార్షికోత్సవాలు నయనానందకరంగా సాగాయి. ఈ సందర్భంగా జరిగిన సంగీత, గాత్రకచేరిలు, పలు నృత్యప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థులు వేదికపై శృతి లయాత్మకం, ముగ్ధమనోహరంగా భక్తిగీతాలు, కీర్తనలుతో ప్రతిధ్వనింపజేశారు. ముఖ్యంగా కె.వరలక్ష్మి కర్ణాటక సంగీతం వీనులవిందుగా సాగింది. విద్యార్థుల గాత్రకచేరీలో కీర్తనలు, భక్తిగీతాలు సుమధురంగా శ్రోతలను ఆధ్యాత్మికలోకంలో ఓలలాడించాయి. పి.వి.రమణమూర్తి మృదంగ వాద్యం విశేషంగా ఆకట్టుకుంది. ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారగ్రహీత డి.రాఘవాచారి కళాకారులను సత్కరించి వారి ప్రదర్శనలను మెచ్చుకున్నారు.

## నల్ల పోచమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవం

### పాల్గొన్న మేడ్చల్ మల్కాజిగిరి డిసిసి ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్



ప్రత్యేక పూజలో పాల్గొన్న కూన శ్రీనివాస్‌గౌడ్

**నిజాంపేట్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారాం డివిజన్ పరిధిలోని బతుకమ్మ బండ దేవేందర్‌నగర్‌లో నల్ల పోచమ్మ అమ్మవారి కళ్యాణం మహోత్సవం సందర్భంగా ఆదివారం ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు మేడ్చల్ మల్కాజిగిరి డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్‌గౌడ్ హాజరై నల్ల పోచమ్మ అమ్మవారి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ నల్ల పోచమ్మ అమ్మవారి ఆశీస్సులుళ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్‌ని శాలువాతో సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పూలమ్మ, సంగయ్య, మంజుల, వీరప్ప, శివప్ప, శ్రీనివాస్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. =

## డీప్‌రూట్ హైస్కూల్ సీజ్

### విద్యార్థులు ఆందోళన చెందొద్దు : ఎంఈఓ

**బషీరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ డివిజన్ విమానపురి కాలనీలోని డీప్‌రూట్ హైస్కూల్‌ను మండల విద్యాశాఖాధికారిణి జెమినికుమారి శనివారం సాయంత్రం సీజ్ చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా పాఠశాల ప్రాంగణాన్ని మార్చడంవల్ల గుర్తింపు రద్దుచేస్తూ, స్కూల్ మూసివేతకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులతో వచ్చేవారం కుత్బుల్లాపూర్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంఈఓ తెలిపారు. ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ప్రభుత్వం లేదా గుర్తింపు పొందిన పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు చేపడతామని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని సూచించారు. సీజ్ చేసిన పాఠశాలలో కార్యకలాపాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## జనసేన పార్టీలోకి చేరికలు...



పార్టీలో చేరిన యువత

**కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** కెపిహెచ్‌బి కాలనీ కాలనీ 5వ జనసేన పార్టీ కార్యాలయంలో పవన్ కళ్యాణ్ చేసే మంచిపనులు వారి ఆశయాలు పార్టీ సిద్ధాంతాలు నచ్చి కుకట్‌పల్లి నియోజకవర్గం అడక్ కమిటీ సభ్యులు వేముల మహేష్ ఆధ్వర్యంలో కుకట్‌పల్లి డివిజన్ నుండి యువత జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారిని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జనసేన పార్టీ కోఆర్డినేటర్ ప్రేమకుమార్ పార్టీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమం సందర్భంగా పార్టీలో చేరినవారు రోహిత్‌గౌడ్, సాయిశ్రవణ్, భానుప్రకాష్, రోహన్, సాయిపవన్ తేజ్, భరత్, గణేష్, వర్షిత్ తదితరులను ప్రేమకుమార్ అభినందించారు. ఈ సందర్భంగా ప్రేమకుమార్ మాట్లాడుతూ యువతకి పార్టీలో మంచి గుర్తింపు ఉంటుందని, పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పని చేస్తే మంచి నాయకులుగా ఎదుగుతారని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జనసేన నాయకులు కొల్లా శంకర్, రణదీప్, గుణ శేఖర్ పాల్గొన్నారు.

## ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవ వేడుకలు

**జీడిమెట్ల, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని అపురూప కాలనీలో సాయిబాబా ఆలయం 27వ వార్షికోత్సవం ఆదివారం భక్తి శ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, నాయకుడు గుబ్బల లక్ష్మీనారాయణ పాల్గొని సాయిబాబా ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో అపురూప కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు తిప్పారెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసశాస్త్రీ, మాజీ అధ్యక్షుడు గణేషన్, ఆలయ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజబాబు, అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ కృష్ణారెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, విజయ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

## వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవం...

**కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** బాలనగర్‌లో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామివారి 33వ ఆరాధన మహోత్సవం విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావుని కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారు సమాజానికి ధర్మమార్గం చూపిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు దాసరి శంకర్‌రెడ్డి, కంచి మహేందర్‌యాదవ్, బాలానగర్ డివిజన్ అధ్యక్షులు డాక్టర్ కిరణ్ కుమార్, సీనియర్ నాయకులు శ్రీశైలం, కమిటీ అధ్యక్షులు రెడ్డప్ప చారి, జయ రాములు చారి, నిర్వాహకులు, భక్తులు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఆరాధన మహోత్సవంలో పాల్గొన్న నాయకులు

# విడినూనె విక్రయాలను నిలిపివేయాలి

### డిసిపి గైక్వాడ్‌వైభవ్ రఘునాథ్



నూనె వ్యాపారులతో మాట్లాడుతున్న డిసిపి గైక్వాడ్

**బేగంబజార్, ఏప్రిల్ 26ప్రభాతవార్త:** ప్రజారోగ్యానికి హానికలిగించే విడి నూనె అమ్మకాలపై హైదరాబాద్ సిటీ పోలీసులు దృష్టిసారించారు. నగరంలో నూనె తయారీదారులు, సరఫరాదారులతో ఆదివారం బేగంబజార్‌లోని హెచ్-పాస్ట్ ఫుడ్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ డిసిపి, హెచ్-పాస్ట్ ఫుడ్ ఇన్‌చార్జ్ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ మాట్లాడుతూ వంట నూనెల వ్యాపారంలో పాటించాల్సిన చట్టపరమైన నిబంధనలపై వ్యాపారులకు దిశానిర్దేశం చేశారు. రసాయనాలు, వాడటం వంటి చర్యలకు పాల్పడితే లైసెన్స్‌లు రద్దు చేయడమే కాకుండా కారాగార శిక్ష తప్పదని హెచ్చరించారు. పరిశుభ్రత ప్రమాణాలు, నూనె తయారీ కేంద్రాల్లో, నిల్వ కేంద్రాల్లో ఆహార భద్రతా ప్రమాణాల ప్రకారం పరిశుభ్రతను పాటించాలన్నారు. తక్కువ ధరకు వస్తుందని కొనుగోలు చేయకుండా నాణ్యతమైన నూనెను కొనుగోలు చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఎక్కడైనా నూనె కల్తీ జరుగుతున్నట్లు అనుమానం వస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. నూనెలో తక్కువ రకం నూనెలను కలపడం లేదా హానికరమైన రసాయనాలు వాడటం వంటి చర్యలకు పాల్పడితే లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు.వ్యాపారులు తమ పనితీరును మార్చుకునేందుకుగాను 15 రోజుల గడువును ఇచ్చారు. ఈ గడువులోగా విడినూనె విక్రయాలను పూర్తిగా నిలిపివేసి వంద శాతం ప్యాకెజింగ్, బ్రాడింగ్ నిబంధనలు పాటించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో హెచ్-పాస్ట్ ఇన్‌స్పెక్టర్లు ఎం.అంజయ్య, ఎన్.రంజిత్‌కుమార్‌గౌడ్‌లతోపాటు నగరంలోని నూనె వ్యాపారులు పాల్గొన్నారు.




నవీన్‌కుమార్‌కు నియామక పత్రాన్ని అందిస్తున్న చంటి ముదిరాజ్

## అవినీతిని ఎదుర్కోవడానికే సమాచార హక్కు చట్టం

**సైఫాబాద్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** సమాచార హక్కు చట్టం ద్వారా ప్రభుత్వంలోని అవినీతిని ఎదుర్కొనడానికి ప్రజలను ప్రోత్సహించడమే సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ముఖ్య ఉద్దేశమని కమిటీ జాతీయ ఛైర్మన్ డా. చంటి ముదిరాజ్ చెప్పారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో కమిటీ జాతీయ సహాయ కార్యదర్శిగా మార్క నవీన్‌కుమార్‌గౌడ్‌ను నియమించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాచార హక్కుచట్టం సాధన కమిటీ అనేది సమాచార చట్టాన్ని అమలు చేయడానికి, పౌరులకు సమాచారాన్ని పొందే హక్కును ఉపయోగించడంలో సహాయపడటానికి ఏర్పడిన కమిటీ అన్నారు. ఈచట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, సమర్థవంతంగా అమలు చేయడానికి ప్రభుత్వంతో కలిసి కమిటీ పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా మార్క నవీన్‌గౌడ్ మాట్లాడుతూ తనకు కమిటీ సహాయ కార్యదర్శిగా నియమించిన డా.చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి, రాష్ట్ర అధికార ప్రతినిధి కాశీ సతీష్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు శివకుమార్, అరవింద్‌స్వామి, భోగం విష్ణు, దీపక్‌కులకర్ణి పాల్గొన్నారు.

## 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి భూమిపూజ



ప్రభుత్వాసుపత్రి భవననిర్మాణానికి భూమిపూజచేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**నాచారం, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** మల్లాపూర్, నాచారం, హౌసింగ్ బోర్డ్ ప్రాంతాల ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలనే లక్ష్యంతో 100 పడకల ఆధునిక ఆసుపత్రి నిర్మాణానికి శ్రీకారంచుట్టారు. ఈ మేరకు ఆదివారం మల్లాపూర్ ఎలిఫెంట్ చౌరస్తాలో నిర్వహించిన భూమి పూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై శుభారంభం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాంత ప్రజలకు సమీపంలోనే నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆసుపత్రి నిర్మాణంతో మల్లాపూర్, నాచారం, హౌసింగ్ బోర్డ్ పరిసర ప్రాంతాల ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జేరిపోతుల ప్రభుదాస్, పన్నాల దేవేందర్ రెడ్డి, గుండారపు శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సాయిజెన్ శేఖర్, గంధం నాగేశ్వరరావు, కాసం మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రగుంట శ్మశానవాటిక శుభ్రపరిచిన కమిటీ

### వైకుంఠధామంగా అభివృద్ధికి చర్యలు

**నాచారం, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :** నాచారం ఎర్రగుంటలోని హిందూ శ్మశానవాటికలో విపరీతంగా పెరిగిన పిచ్చి చెట్లు, కంపచెట్లు, ఎండిపోయిన చెట్ల కొమ్మలు, చెత్త మట్టి కుప్పలతో తీవ్ర అస్వచ్ఛత నెలకొంది. దీంతో నాచారం డివిజన్ మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ సహకారంతో శ్మశానవాటికను పూర్తిగా శుభ్రపరిచినట్లు నూతనంగా ఏర్పాటైన స్మశాన వాటిక కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి, సుమారు రూ.3 కోట్ల వ్యయంతో శ్మశానవాటికను ఆధునిక వైకుంఠధామంగా తీర్చిదిద్దేందుకు మంజూరైన నిధులకు సంబంధించిన టెండర్ ప్రక్రియను త్వరగాపూర్తి చేయాలని కోరారు. అలాగే, మిగిలిన చెత్త తొలగింపునకు మున్సిపల్ అధికారులద్వారా రెండు రోజుల పాటు ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలంటూ విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే, త్వరలోనే వైకుంఠధామం పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వెంటనే నాచారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ నిత్యానందంకు ఫోన్ చేసి స్మశాన వాటికలో శానిటేషన్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శ్రీమూర్తి నాగరాజ్, కొమ్మగల ప్రవీణ్, చిలుక శంకర్, జంగం నర్సింగ్, జంగం రాములు, బందెల మనోజ్, బి. బాలరాజ్, జంగా శ్రీధర్, ఎం. శ్రవణ్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



స్వర్ణలతా భీమార్జున్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న బిజెపి నాయకులు

## బిజెపి రాష్ట్ర కార్యదర్శి స్వర్ణలతారెడ్డికి శుభాకాంక్షల వెల్లువ

**నార్సింగి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన అన్నపురెడ్డి స్వర్ణలతారెడ్డికి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పోటాపోటీగా శుభాకాంక్షలు తెలుపుతున్నారు. రెండు దశాబ్దాలగా ప్రజాక్షేత్రంలో ఉంటూ కిస్మత్‌పూర్ ఎంపిటిసిగా, రాజేంద్రనగర్ మండల వైస్ ఎంపిపిగా బాధ్యతలు నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందించారు. రాజేంద్రనగర్ నుంచి టిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి గట్టిపోటీని ఇచ్చారు. స్వర్ణలతారెడ్డి చురుకుదనం గమనించిన రాష్ట్ర నాయకత్వం ఆమెకు రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి బాధ్యతలను అప్పగించింది. ఈ విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ జోన్, సర్కిల్ పరిధిలోని బిజెపి నాయకులు, కార్యకర్తలు ఆమె నివాసానికి వెళ్లి శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాకు రాష్ట్రస్థాయి బాధ్యతను అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రారావ్, ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

## మహేంద్రహిల్స్‌లో ఘనంగా హన్‌మాన్ బిక్షా

**కంటోన్మెంట్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** శ్రీరాముని ధర్మపత్ని శ్రీజానకీ మాతా జయంతిని పురస్కరించుకొని సికింద్రాబాద్ మహేంద్రహిల్స్‌లోని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జె.రామక్రిష్ణ నివాసంలో హన్‌మాన్ పూజా (బిక్ష) ఘనంగా నిర్వహించారు. సీతా మాతకు ప్రత్యేక పూజా, సామూహిక హన్‌మాన్ చాలీసా,పారాయనం వంటి భజన కార్యక్రమాలు నిర్వహించడంతో పరిసర ప్రాంతాలు మారుమ్రోగాయి.

## ఫీజుల దోపిడీని అరికట్టాలని మహా ధర్నా

**ముషిరాబాద్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** రాష్ట్రంలో విద్య హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, లేని పక్షంలో పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హెచ్చరించారు. రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులు, తల్లిదండ్రులు రాష్ట్రంలో ఫీజుల దోపిడీకి వ్యతిరేకంగా, విద్య హక్కు చట్టం అమలు చేయాలని డిమాండ్ చేసూ ఇందిరాపార్కు ఎదుట పెద్దఎత్తున 'మహా ధర్నా' నిర్వహించారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్నతోపాటు ఎంబిటి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అంజద్‌ల్లాఖాన్, ప్రొఫెసర్ మురళీమోహన్, కార్యనిర్వాహక అధ్యక్షుడు సుదగాని హరిశంకర్‌గౌడ్ తదితరులు మాట్లాడుతూ కార్పోరేట్, ప్రైవేటు విద్యా సంస్థల్లో విద్యార్థులు అధిక ఫీజులను చెల్లించలేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను మూసి వేస్తూ ప్రైవేటు పాఠశాలలకు పెద్ద ఎత్తున అనుమతులు ఇస్తూ ప్రోత్సహిస్తున్నదని ఆరోపించారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో చేరుతున్నారని, డోనేషన్లు, ఫీజులు పేరిట దోపిడీ చేస్తున్నాయని వారన్నారు. ప్రభుత్వం తక్షణమే ఫీజుల దోపిడీని అరికట్టాలని, మూసివేసిన ప్రభుత్వం పాఠశాలలను వెంటనే తెరిపించాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, విద్యార్థులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను పరిష్కారించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి చేతకాకపోతే 2029లో జరిగే ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి వచ్చి చేసి చూపిస్తామని తీన్మార్ మల్లన్న హెచ్చరించారు. ఈ మహాధర్నాలో వివిధ ప్రజా సంఘాల నేతలు పాల్గొని సంపూర్ణంగా మద్దతు ప్రకటించారు.



మహా ధర్నాలో మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న

# సేవ్ కెబిఆర్ పేరిట ఆందోళన - పర్యావరణ పరిరక్షణకు పిలుపు



పార్కు ముందు ఆందోళన నిర్వహిస్తున్న పర్యావరణ ప్రేమికులు

**జూబ్లీహిల్స్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** నగరానికి ఊపిరిగా నిలిచిన కేబీఆర్ పార్కు పరిరక్షణ కోసం సేవ్ కేబీఆర్ పేరిట ఆదివారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని పర్యావరణ కార్యకర్తలు, స్థానిక ప్రజలు, పౌర సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని పార్కు చుట్టూ ప్రతిపాదిత రహదారి పనులకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సేవ్ కేబీఆర్ క్యాంపెయిన్ ప్రతినిధి విజయరెడ్డి మల్లంగి మాట్లాడుతూ, కేబీఆర్ పార్కు చుట్టూ ఉన్న ఎకో సెన్సిటివ్ జోన్‌ను అన్యాయంగా తగ్గించడం పర్యావరణానికి ముప్పని అన్నారు. ప్రజా విచారణలేకుండానే తీసుకున్న నిర్ణయాలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. 2021లో హైకోర్టు ఇచ్చిన స్టే ఉన్నప్పటికీ చెట్ల నరికివేత కొనసాగుతుండటం ఆందోళనకరమని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో అమలు చేయనున్న హెచ్ సిటీ ప్రాజెక్ట్ కింద కేబీఆర్ చుట్టూ ఫ్లై ఓవర్లు,అండర్‌పాస్‌లు నిర్మించాలనే ప్రతిపాదనలను నిరసనకారులు వ్యతిరేకించారు. సుమారు రూ. 930 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్, డిజైన్‌లు, పర్యావరణ అనుమతులను ప్రజల ముందుకు తీసుకురావాలని డిమాండ్ చేశారు. కేబీఆర్ పార్కు నగర ఉష్ణోగ్రత నియంత్రణ, గాలి నాణ్యత మెరుగుదల, భూగర్భ జలాల రీచార్జ్‌లో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఇలాంటి పచ్చని ప్రాంతాన్ని కాంక్రీట్ నిర్మాణాలతో చుట్టేస్తే భవిష్యత్ తరాలకు నష్టం జరుగుతుందని హెచ్చరించారు. ఫ్లైఓవర్లు ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం కాదని, ప్రజా రవాణా వ్యవస్థ బలోపేతమే సరైన మార్గమని ఆందోళనకారులు స్పష్టం చేశారు. బస్సులు, మెట్రో, లాస్ట్ మైల్ కనెక్టివిటీ, పాదచారుల భద్రతపై దృష్టి పెట్టాలని కోరారు. కేబీఆర్ పరిసరాల్లో జరుగుతున్న అన్ని పనులను తక్షణమే నిలిపివేసి, సమగ్ర పర్యావరణ ప్రభావ అంచనా నిర్వహించాలని, ప్రజా విచారణ చేపట్టాలని నిరసనకారులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



నాదెండ్ల భాస్కర్‌రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

## నాదెండ్లకు ఘన నివాళులు

**హైదరాబాద్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :** మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నాదెండ్ల భాస్కర్‌రావుకు సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు.నగరానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎస్.హరినాథ్‌రెడ్డి, జి.బి.శ్యామ్‌రావు, విజితారెడ్డి తదితరులు ఆదివారం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసానికి వెళ్లి భాస్కర్‌రావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాదెండ్ల భాస్కర్‌రావు కుమారుడు, ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు. భాస్కర్‌రావుతో తమకు ఉన్న పరిచయాన్ని ఈ సందర్భంగా వారు గుర్తుచేసుకున్నారు.

## ఘనంగా బసవేశ్వర జయంతి

**ఖైరతాబాద్, ఏప్రిల్ 26 (ప్రభాతవార్త):** ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఖైరతాబాద్ డివిజన్ లైబ్రరీ చౌరస్తా (బడా గణేష్) వద్ద రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం ఆధ్వర్యంలో శ్రీ మహాత్మా బసవేశ్వర 893వ జయంతి వేడుకలు ఆదివారం సంఘం రాష్ట్ర కోశాధికారి కల్లపల్లి రాజప్ప ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఖైరతాబాద్ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే, మాజీ కార్పొరేటర్ పి. విజయరెడ్డి హాజరై మహాత్మా బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకర హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ప్రజలు ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యనిర్వాహకులతోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

**చార్మినార్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :** వైద్య,ఆరోగ్య రంగాలకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నదని, ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఆర్ ఎంఈ) పేదలకు వరంలాంటిందని బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్‌కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన 48 వేల రూపాయాల చెక్‌ను ఆదివారం ఆయన మిశ్రిగంజ్ ప్రాంతానికి చెందిన ఓ పేద కుటుంబానికి వైద్య సహాయం కోసం అందజేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్‌బి సైన్సు కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు

**చార్మినార్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :** చార్‌కమాన్‌లోని నానక్‌రామ్ భగవాన్‌దాస్ సైన్సు కళాశాల, ఎస్‌డిఎస్ ఆర్ట్, కామర్స్ కళాశాల సిల్వర్ జూబ్లీ కార్యక్రమం ఘనంగా జరిగింది. వివిధ పోటీలలో ప్రతిభ కనపరిచిన కళాశాలల విద్యార్థులకు మెమోంటోలు ప్రదానం చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అగ్రసేన్ చారిటిబుల్ ట్రస్ట్ ఛైర్మన్ గోపాల్‌చంద్ అగర్వాల్ అగర్వాల్ శిక్షా సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ కేడియో, అగర్వాల్ శిక్షా సమితి ప్రతినిధులు డాక్టర్ శ్యామ్ సుందర్, సి.ఎ.నవీన్‌కుమార్, ముకుంద్‌లాల్ అగర్వాల్, ఓం ప్రకాష్ అగర్వాల్‌లు శిక్షా సమితి ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యా సంస్థలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డిఎస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.హెచ్.డాల్‌పడాల్, ఎన్‌బి సైన్సు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.బాబురావు, ఎంబిఎ డైరెక్టర్ ప్రొఫెసర్ పల్లవి రంగనాధ్, ఎంసిఎ డైరెక్టర్ కె.ఎల్.ఎల్.మాధురితో పాటు పలువురు పాల్గొన్నారు. కాగా ఎన్‌బి సైన్సు కళాశాల, ఎస్‌డిఎస్ కళాశాల సిల్వర్ జూబ్లీ కార్యక్రమం ఘనంగా జరిగిందని కళాశాలల ప్రిన్సిపాళ్లు డాల్ పడాల్, బాబూరావు తెలిపారు.

## బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి




పీస్ కమిటీ ప్రతినిధులతో మాట్లాడుతున్న సిఐ పరుశురాం

**గన్‌ఫౌండ్రి, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** రానున్న బక్రీద్‌పండుగను పురస్కరించుకుని వివిధ ప్రభుత్వ విభాగాలతోపాటు పీస్ కమిటీ ప్రతినిధులతో అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఇన్‌స్పెక్టర్ పరుశురాం మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగను జరుపుకోవాలని కోరారు. కులమతాలకు అతీతకంగా సహకరించాలన్నారు. ముఖ్యంగా సానిటేషన్ అధికారులు, సిబ్బంది పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. వెటర్నటి అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో డిఐ ప్రసాదరావు, ఎస్ఐలు శ్రీకాంత్, గౌరేందర్, తిరుమల్లేష్, జిహెచ్ఎంసి కోఆర్డినేటర్ రాంబాబు, ఫీస్‌కమిటీసభ్యులు పాల్గొన్నారు.

## త్వరలో కలుషిత నీటి సమస్యను పరిష్కరిస్తాం



నీరు కలుషితమవుతున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు, నేతలు

**బేగంపేట, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** బేగంపేట డివిజన్ పరిధిలోని ఓల్డ్ కస్టమ్స్ బస్తీలో కలుషిత నీటి సరఫరా జరుగుతుందని, దీంతో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని, వెంటనే పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలంటూ కాంగ్రెస్ నేతలు మునీర్‌ఖాన్, హనీఫ్‌ఖాన్, శంకర్‌యాదవ్, నసీరుద్దీన్(అడ్డు) తదితరులు ప్రకాశంనగర్ వాటర్‌వర్క్స్ కార్యాలయంలో ఫిర్యాదు చేసారు. దీనిపై స్పందించిన జలమండలి డీజీఎం ఆశీష్, మేనేజర్ ఝాన్సీ, జీహెచ్ఎంసీ ఏఈ గణేష్‌తో పాటు కాంగ్రెస్ నేతలు తాగునీరు కలుషితం అవుతున్న ప్రాంతానికి చేరుకుని పరిశీలించారు.కలుషిత నీటి సమస్యవల్ల బస్తీ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను నేతలు అధికారులకు వివరించారు. ఈ సమస్య ప్రజల ఆరోగ్యానికి ముడిపడి ఉందని, వీలైనంతవేగంగా సమస్య పరిష్కరించాలని కోరారు. త్వరగా సమస్యను పరిష్కరించనున్నట్లు జలమండలి అధికారులు వారికి తెలియజేసారు.

## వైభవంగా దాస హనుమాన్ విగ్రహ పునఃప్రతిష్టాపన

**చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** పాతబస్తీ లాల్‌దర్వాజా వెంకట్రావు స్కూల్ సమీపంలోని శ్రీ దత్తాత్రేయ స్వామి మందిరం (పెద్ద)లో ఆదివారం శ్రీ దాస హనుమాన్ విగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆ ఆలయ నిర్వాహకులు, అర్చకులు పి.దత్తప్రసాద్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలతో ప్రారంభమైయ్యాయి. స్వామి వారికి అభిషేకం, అర్చన, అత్యంత ప్రీతికరమైన ఆకుపూజ వంటి విశేష పూజలు నిర్వహించారు. నైవేద్యాన్ని సమర్పించి కర్పూర నీరాజనాలిచ్చారు. అనంతరం శ్రీ సీతారాముల కల్యాణో మహోత్సవం కమనీయం రమణీయంగా జరిగింది. సమీప బస్తీలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై శ్రీరామ భక్త దాస హనుమాన్‌ను దర్శించుకొని పూజలు చేశారు. ఆ తరువాత శ్రీ సీతారామలక్ష్మణులను సేవించారు. నిర్వాహకులు భక్తులకు మహా ప్రసాద వితరణ చేపట్టారు.



పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే తలసాని

## శాంతికి ప్రతీక వాసవీ కన్యకాపరమేశ్వరీ మాత : ఎమ్మెల్యే

**బేగంపేట, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవమైన శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీమాత అహింస, ఆత్మగౌరవం, శాంతికి ప్రతీకగా నిలుస్తారని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వాసవీ మాత జయంతి సందర్భంగా రాంగోపాల్‌పేట డివిజన్‌లోని అవుల మందలో ఉన్న శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మ వారి ఆలయం నుంచి నిర్వహించిన అమ్మవారి యాత్రలో తలసాని పాల్గొన్నారు. ముందుగా అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ నార్ల దీపక్, ఆలయ చైర్మన్ చందా బాలేందర్,ప్రధాన కార్యదర్శి తమ్మి వెంకటేష్, బచ్చు మహేష్, శరత్, గుండా శ్రీనివాస్, వినోభ, ప్రేమ్, తడ్క వెంకటేష్ పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే



కంటోన్మెంట్ ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గం లోని వివిధ బస్తీలు, కాలనీల్లో నెలకొన్న సమస్యలను త్వరగా పరిష్కరిం చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. ఆదివారం తుకారాంగేట్‌లో నివాసం ఉంటున్న ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను నేరుగా కలుసుకునేందుకు ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు,వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం అయ్యే దిశగా చూడాలని అధికారులను ఆదేశించారు.

## ఘనంగా వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి



అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న చికోటి ప్రవీణ్ తదితరులు

**జూబ్లీహిల్స్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ పరిధిలోని యూసఫ్‌గూడ కృష్ణనగర్ లేబర్ అడ్డా వద్ద వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అల్పాహార వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, హిందూ ధర్మ రక్ష ఫౌండర్ డా. చికోటి ప్రవీణ్ హాజరై స్వయంగా భక్తులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ సభ్యులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## బసవతారకంలో న్యూక్లియర్ మెడిసిన్‌పై ప్రత్యేక సదస్సు



సదస్సులో పాల్గొన్న వైద్యులు

**జూబ్లీహిల్స్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ న్యూక్లియర్ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల వైద్యుల కోసం ప్రత్యేక సదస్సు, శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 180 మందికిపైగా వైద్యులు, టెక్నాలజిస్టులు, విద్యార్థులు పాల్గొన్నారు.అడ్వాన్స్డ్ డయాగ్నస్టిక్ టెక్నిక్స్ అండ్ ఇంటర్వెన్షన్స్ పేరుతో జరిగిన ఈ సదస్సును డా. కల్పనా రఘునాథ్, డా. జాకిర్ అలీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డా. జాకిర్ అలీ మాట్లాడుతూ న్యూక్లియర్ మెడిసిన్ ద్వారా పెట్‌సిటి వంటి ఆధునిక పద్ధతులతో క్యాన్సర్ సహా అనేక రోగాలను నిర్ధారించడమేకాకుండా చికిత్స అందించవచ్చన్నారు. ఈ సాంకేతికతపై మరింత అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు అవసరమని చెప్పారు. కార్యక్రమంలో పెట్‌సిటి గైడెడ్ బయాప్సీ, మస్క్యులోస్కెలెటల్ ఇమేజింగ్, గ్యాస్ట్రోఎంటరాలజీ అప్లికేషన్లు, ప్రోస్టేట్ క్యాన్సర్ నిర్ధారణవంటి అంశాలపై నిపుణులు శిక్షణ ఇచ్చారు. న్యూక్లియర్ మెడిసిన్‌లో తాజా పరిజ్ఞానాన్ని పంచుకునేందుకు ఈ సదస్సు ఉపయోగపడిందని పాల్గొన్నవారు తెలిపారు.

## సంత్ నిరంకారి మండల్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: మానవ ఏకతా దివస్ సందర్భంగా సంత్ నిరంకారి మండల్ ఆధ్వర్యంలో లక్డీకాపూల్‌లోని సంత్ నిరంకారి సత్సంగ్ భవన్‌లో భారీ స్థాయిలో రక్తదాన శిబిరం, ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రక్తదాన శిబిరంలో 250 మంది రక్తదానం చేసి మానవతా సేవకు ముందుకు వచ్చారు. అదేవిధంగా ఉచిత మెగా హెల్త్ చెకప్ క్యాంప్‌లో అనేక మంది ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా సమాజంలో మానవత్వం, ఏకతా భావం పెంపొందించాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి : సంచిత్ గన్వర్

**కంటోన్మెంట్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** విద్యార్థులు వేసవిలో నిర్వహిస్తున్న క్రీడా శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గన్వర్ తెలిపారు. వెస్ట్‌మారేడ్‌పల్లి షెనాయ్ మున్సిపల్ మైదానంలో నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడాల్లోనూ ప్రతిభకనబర్చాలన్నారు.వేసవిలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన క్రీడా శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి డిసి జకియా సుల్తానా,స్పోర్ట్స్ విభాగం ఇన్‌స్పెక్టర్ నెమలి గాయిత్రి, తదితరులు పాల్గొన్నారు. ఈ శిక్షణా శిబిరాలు మే 31 వరకు కొనసాగుతాయి. 57 క్రీడా మైదానాల్లో క్రికెట్,బాస్కెట్ బాల్,ఫుట్ బాల్,వాలీబాల్,బ్యాడ్మింటన్ వంటి కరాటే 17 రకాల క్రీడలకు కోచ్‌లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు వై.రాజు, విజయ్ మోహన్, క్రిష్ణ,ఎస్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణా తరగతులను ప్రారంబిస్తున్న జోనల్ కమిషనర్ సంచిత్ గన్వర్

# వాసవీమాత జయంతిని ప్రభుత్వం నిర్వహించడం సంతోషకరం

## మంత్రి పొన్నం ప్రభాకర్



వాసవీమాతకు పూజలు చేస్తున్న మంత్రి పొన్నం, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కల్వ సుజాతలు

**బేగంపేట ఏప్రిల్ 26,ప్రభాతవార్త :** రాంగోపాల్‌పేట డివిజన్ పరిధిలోని అవులమంద శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో అమ్మవారి జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజు ఆదివారం వివిఐపీలతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. వాసవీ అమ్మవారికి అర్చనలు, పారాయణం, పూజలు నిర్వహించారు.ఆదివారం మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాతలు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ లోక రక్షతే లోక కళ్యాణార్థం జరిపే శ్రీవాసవీ మాత అమ్మవారి జయంతిని ప్రజాపాలన ప్రభుత్వం మొదటిసారిగా అధికారికంగా నిర్వహిస్తుందని, ఇది ఎంతో సంతోషకరం అన్నారు. వాసవీ మాత జయంతి సందర్భంగా అమ్మవారి ఆశీర్వాదం కోరుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు ఎలాంటి అవరోధాలు లేకుండా కొనసాగేలా ఆశీర్వాదం ఇవ్వాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలియజేసారు. కల్వ సుజాత మాట్లాడుతూ ఆర్యవైశ్యులంటే కాంగ్రెస్ పార్టీకి అమితమైన అభిమానమని, గతంలో మాజీ ముఖ్య మంత్రి దివంగత కొణిజేటి రోశయ్య చొరవతో మరో మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వాసవీ అమ్మవారి దేవాలయాలను సత్రాలను సొంతంగా నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేసారని గుర్తు చేసారు. తాజాగా తమ అభ్యర్థన మేరకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్యవైశ్యుల కుల దైవమైన శ్రీవాసవీ మాత అమ్మవారి జయంతిని రాష్ట్ర పండుగల జాబితాలో చేర్చించిందని తెలిపారు. ఇందుకు సీఎం రేవంత్‌కు మంత్రులు, అధికారులకు యావత్ ఆర్యవైశ్య జాతి తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు చందా బాలేందర్, ప్రధాన కార్యదర్శి తమ్మి వెంకటేష్, కోశాధికారి మునుసాని శరత్‌కుమార్, పాలూరి రమేష్, వినోభా, మాశెట్టి శ్రీనివాస్, పూర్ణచందర్, బచ్చు మహేష్, తదితరులు పూజలలో పాల్గొన్నారు. పూజలలో సికింద్రాబాద్ ఆర్యవైశ్య మహాసభ, ఆర్యవైశ్య క్లబ్, వాసవి క్లబ్, తదితర సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



వీరబ్రహ్మేంద్ర స్వామి చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

## భక్తిప్రపత్తులతో వీరబ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు

**చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 333వ ఆరాధనోత్సవాలను విశ్వబ్రాహ్మణులు ఆదివారం భక్తి ప్రపత్తులతో జరుపుకున్నారు. పాతబస్తీ అలియాబాద్ రాజన్నబావి లక్ష్మీనగర్‌లోగల పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం, కందికల్‌గేట్ తూంబండ ఈదమ్మ దేవాలయంలో నిర్వాహకులు విశేష కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం అభిషేకం, అలంకరణ, విశేష అర్చనలు, గణపతి హవనం, మూతమంత్ర హవనం, పూర్ణాహుతి, నివేదన, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద, అన్నప్రసాద వితరణ, సాయంత్రం అర్చనలు, రాత్రికి మంగళ హారతి, పల్లకి సేవ పూజలు చేపట్టారు. సమీపబస్తీలలో నివసించే విశ్వబ్రాహ్మణులు, భక్తులు వీరబ్రహ్మంగారిని దర్శించుకొని పూజలు చేశారు. కొబ్బరి కాయలు సమర్పించి కర్పూర నీరాజనాలిచ్చారు. ఈ కార్యక్రమంలో తల్లోజు పరిపూర్ణాచారి, తల్లోజు బ్రహ్మయ్య, రామోజు శ్రీనివాస్, పుష్పలత, శోభారాణి మహిళా భక్తులు పాల్గొన్నారు. రాజన్నబావి సంతోషిమాత, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో ఆరాధనోత్సవాలు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. సాయంత్రం అందంగా తీర్చిదిద్దిన పల్లకిలో బ్రహ్మంగారు గోవిందమ్మల ఉత్సవ విగ్రహాలను మేళతాళాలతో పురవీధుల్లో ఊరేగించారు. కార్యనిర్వాహకులు మాట్లాడుతూ సంతోషిమాత వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ పునః నిర్మాణం సుబ్రహ్మణ్యాచార్యుల పర్యవేక్షణలో జరుగబోతున్నదని వెల్లడించారు. శ్రీ వేంకటేశ్వర కూచిపూడి నృత్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథిగా మజ్లిస్ పార్టీ నాయకులు పులికంటి నరేష్ హాజరై స్వామివార్లను పూజించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సభ్యులు ముసలోజు రాజు, చెప్పాలా హరిబాబు, చాందాయపేట బ్రహ్మం, ఈశ్వరోజు నవీన్, ఆలూరి లక్ష్మణ్, పెరికేటి వెంకటయ్య, గుగ్గిళ్ళ అశోక్, అల్లం నరేష్, దినపల్లి నరేష్, గుణగల శ్రీశైలం, కొవ్వ రమేష్, బైరి వెంకటనారాయణ, పున్నపు వీరయ్య, బాబు సాయి, గుగ్గిళ్ళ స్పీకర్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప ధర్మశాస్త్ర సేవ సమితి ఆధ్వర్యంలో అన్నదానం

**సికింద్రాబాద్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** అయ్యప్ప ధర్మశాస్త్ర సేవ సమితి ఆధ్వర్యంలో సికింద్రాబాద్ గాంధీ, పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రుల వద్ద ఆదివారం 300 మంది అన్నార్తులు, అభాగ్యులు, రోగి సహాయకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గత పదేళ్లుగా అనేక సామాజిక, ఆధ్యాత్మిక సేవ కార్యక్రమాలు, నగరంలోని పలు ప్రభుత్వ ఆస్పత్రులవద్ద అన్నదాన వితరణలు చేపట్టామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో చింతల్ అయ్యప్ప ధర్మశాస్త్ర సేవసమితి అధ్యక్ష కార్యదర్శులు టి.వెంకటేష్ (ముంబాయి గురుస్వామి), ఎస్. పుల్లారావు, కోశాధికారి కేవీ రాజేంద్ర ప్రసాదరావు, సంయుక్త కార్యదర్శి బి.సుబ్రహ్మణ్యం, కార్యనిర్వాహకసభ్యులు సీహెచ్ కిషోర్, ఈశ్వర్‌రెడ్డి, కోటి రెడ్డి, అనీల్‌కుమార్‌రెడ్డి, దొరబాబు, సాయిమణికంత, కనకదుర్గ, నాగయశ్వీ, కేసన, రియాజ్, అన్విత్‌సాయి, సీహెచ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## హిందూ ఐక్యత దేశానికి అవసరం

**చిక్కడపల్లి, ఏప్రిల్ 26 (ప్రభాతవార్త):** ప్రస్తుత సమాజంలో హిందూ ఐక్యత అవసరమని ఆధ్యాత్మిక గురువు విజ్ఞానంద భారతిస్వామి పేర్కొన్నారు. హిందూ సమ్మేళన ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం విద్యానగర్‌లో కరుణాకరశర్మ అధ్యక్షతన జరిగిన బహిరంగసభలో విజ్ఞానంద భారతి ప్రసంగించారు. హిందూ ధర్మమే దేశానికి రక్ష అని, దేశహితం కోసం ప్రతి హిందువు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. అంతకుముందు సామూహికంగా వందేమాతరం ఆలపించారు.అనంతరం 100 మంది యువతీ యువకులు భక్తిశ్రద్ధలతో చేసిన సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం భక్తులను పరవశింపజేసింది. వేములవాణి శిష్య బృందం సభ్యులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన సభకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్య వక్తలుగా పి.మదన్ గుప్తా, ముదిగొండ ఉషాజ్యోతిర్మయి మాట్లాడుతూ.. హిందూ ధర్మ పరిరక్షణలో ఇటువంటి సమ్మేళనాల పాత్ర కీలకమని ఉద్ఘాటించారు.ఈ కార్యక్రమాన్ని ప్రముఖ న్యాయవాది రాజేష్ బాబు నేతృత్వంలో జరిగిన సభలో కార్యక్రమ పర్యవేక్షకులుగా ముఖ్య సలహాదారు రొయ్యూరు శేష సాయి వ్యవహరించారు. ఉపాధ్యక్షుడు రాళ్లబండి వెంకట రఘువీర్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు కె. సంపత్ కృష్ణ, కె. శ్రీనాథ్, కె. వెంకటేష్ యాదవ్, కూరపాటి శ్రీనివాస్, రోషన్ బాబు మరియు పెద్ద సంఖ్యలో హిందూ బంధువులు పాల్గొన్నారు.

## నాగోల్ గౌడ సంఘం అధ్యక్ష ఎన్నికకు పోటాపోటీ

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** నాగోల్ గౌడ సంఘం ఎన్నికలకు సంబంధించి ఇరు వర్గాలు పోటీ పడడంతో ఎన్నిక గందరగోళంగా మారింది. ఇంద్రాల రమేష్‌గౌడ్, బద్దం వెంకటేష్‌గౌడ్ రెండు ప్యానల్స్ మధ్య ఆదివారం జరగాల్సిన సంఘం ఎన్నికలు అయోమయ పరిస్థితికి దారితీసాయి. రెండు వర్గాలు పోటీ పడడంతో ఎన్నికలు నిర్వహించడానికి ఫోర్మాన్ కమిటీ నిర్ణయించింది. కాగా ఆదివారం ఎన్నికలు నిర్వహించడానికి ఫోర్మాన్ కమిటీలోని ముగ్గురు సభ్యులు రాకపోవడంతో ఇంద్రాల రమేష్‌గౌడ్ ప్యానల్ సభ్యులు 200 పైచిలుకు సభ్యుల సంతకాలతో కూడిన పత్రాన్ని ఫోర్మాన్ కమిటీలో ఉన్న ఒక సభ్యుడు, గీతా కార్మిక సహకార సంగం అధ్యక్షుల సమక్షంలో సమర్పించగా రమేష్‌గౌడ్ ప్యానల్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించుకున్నారు. ఈ సందర్భంగా వారు బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

**త్వరలో ఎన్నికలు ఏకగ్రీవం.....**

ఫోర్మాన్ కమిటీలో ముగ్గురు సభ్యులైన కట్ట ఈశ్వరయ్యగౌడ్, కోలన్ నరసింహగౌడ్, బద్దం ధనంజయగౌడ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి త్వరలో ఇరుపక్షాలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి ఏకగ్రీవంగా ఎన్నికలు జరగడానికి చొరవ తీసుకుంటామన్నారు. గ్రామంలోని కులస్తులందరూ ఏకతాటిపై ఉంటూ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగేందుకు తాము ప్రయత్నిస్తున్నామని తెలిపారు. దశాబ్దాల కాలంగా గ్రామంలో ఎప్పుడు ఎన్నికలు నిర్వహించలేదని గత సాంప్రదాయం ప్రకారమే ఈసారి కూడా అందరి ఏకాభిప్రాయంతో ఏకగ్రీవంగా గౌడ సంఘం కమిటీ ఎన్నుకుంటామన్నారు. ఎవరు అపోహలకు పోవద్దని, తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని, కుల సభ్యులందరూ ఏకతాటిపై ఉండాలని వారు సూచించారు.

## సంస్కృతి సంప్రదాయలను పిల్లలకు తెలియజేయాలి

### స్వర్ణకార సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాఘవచారి

**చార్మినార్,ఏప్రిల్ 26 ప్రభాతవార్త :** చార్‌కమాన్ స్వర్ణకార సంఘం భవనంలో ఆదివారం సంఘం అధ్యక్షులు కొండోజు ఆంజనేయులు,కార్యవర్గం ఆధ్వర్యంలో శ్రీ మద్వి విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి వారి 333 ఆరాధన పూజా కార్యక్రమం జరిగింది.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షులు వింజమూరి రాఘవచారి మాట్లాడుతూ ప్రతీ స్వర్ణకారుడు ఉత్సవాలను కుటుంబ సమేతంగా జరుపుకుని పండుగల ప్రాముఖ్యత,మన సంస్కృతి, సంప్రదాయలను మన పిల్లలకు తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చార్‌కమాన్ స్వర్ణకార యూనియన్ అధ్యక్షులు ఆంజనేయులు చారి,ప్రధాన కార్యదర్శి మహేశ్వరం వేణుగోపాల్, కోశాధికారి కాసుల శ్రీధర్, ప్రతినిధులు శ్రవణ్, విష్ణు, సతీష్,రాష్ట్ర కార్యదర్శి రాగిపని సతీష్, పి.రమేష్, కె.రామాచారి, శివయ్య, రాజా నర్సింహచారి, గిరిధర్ చారితో పాటు పలువురు పాల్గొన్నారు.

## దార్శనికుడు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త:** పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి సమసమాజ దర్శనికుడని మహేశ్వరం నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ పేర్కొన్నారు. జగద్గురు తత్వవేత్త సంఘ సంస్కర్త కాలజ్ఞాన సృష్టికర్త శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 333 ఆరాధన మహోత్సవాలు ఉత్సవ కమిటీ చైర్మన్ రాయబండి పాండురంగచారి, అధ్యక్షులు మారోజు రామాచారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అరవింద్‌శర్మ హాజరై మాట్లాడుతూ కాలజ్ఞాన సృష్టిగా తత్వవేత్తగా యోగిగా సంఘసంస్కర్తగా కీర్తించబడిన బ్రహ్మేంద్ర స్వాములవారు తమ రచనల ద్వారా సామాజిక విప్లవం సాధించిన మహనీయుడు బ్రహ్మం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ మోతుకూరి మల్లాచారి, నాగార్జునకు రాజ్యలక్ష్మి, కొంపోజు శ్రీకాంతాచారి, జయకరణ్‌చారి, అన్నదాన భాస్కరాచారి, కృపాచారి, మారోజు రవితేజ, ఇందిరా, కేశవులు, పోలోజు స్వామిచారి, ఫిరంగి ధర్మాచారి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కొంద్ర శ్రీనివాస్, కంచర్ల శేఖర్, జైస్వరాజ్ పార్టీ జాతీయ అధ్యక్షులు కాసాని శ్రీనివాస్‌గౌడ్, విశ్వకర్మ సంఘం రంగారెడ్డి జిల్లా నాయకులు పులిగిల్ల శ్రీనివాసులుచారి, లెంకోజు యాదగిరి, పడకంటి వెంకటాచారి, పెద్దకొలిమి బ్రహ్మచారి, మైనార్టీ నాయకులు చెకిల్ మీర్జా తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు

**రామంతాపూర్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :** రామంతాపూర్‌లోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం వీరబ్రహ్మేంద్ర స్వామి 333 ఆరాధన ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటి అధ్యక్షుడు బైరోజు రామస్వామిచారి, యాలల వెంకటేశం చారి, వేములవాడ నరసింహాచారి, విశ్వకర్మ ఆత్మ గౌరవ భవనం చైర్మన్ లాలుకోట వెంకటచారి, రామంతాపూర్ విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు నాగారం శ్రీనివాస్ చారి, కొడపర్తి రామచంద్రచారి, గోవిందారం కోటేశ్వరచారి, ఎల్లాచారి, వీరాచారి, వెంకటాచారి, కెఎన్‌చారి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతం, స్వామి వారి అభిషేకం, గణపతిపూజ, యజ్ఞ మహోత్సవం, ఆరాధన మహోత్సవం, తీర్థ ప్రసాద వితరణ, అన్న ప్రసాద వితరణ, ఊరేగింపు నిర్వహించారు.

### పిఎం విద్యాలక్ష్మి పథకం సహకారంతో

## తెలంగాణ యువతకు ఉద్యోగవకాశాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :** తెలంగాణ యువతకు పీఎం విద్యాలక్ష్మి పథకం సహకారంతో ఆతిథ్య రంగంలో డిగ్రీ పూర్తి చేసిన వారికీ జపాన్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు హైదరాబాద్‌లోని వింగిగ్ అకాడమీ జపాన్‌లోని జపాన్ ఇండియా కో ఆపరేషన్ సంస్థతో ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు కొండాపూర్, వింగిగ్ అకాడమీ కార్యాలయంలో ఆదివారం జపాన్ ఇండియా కో ఆపరేషన్ సంస్థ చైర్మన్ కెంజి ఒకు ముర, వైస్ చైర్మన్ జూన్ ఒయబులతో వింగిగ్ అకాడమీ సీఈఓ ఎండి. సింగిరెడ్డి లక్ష్మిరవినాథ్‌రెడ్డి ఆతిధ్యరంగంలో డిగ్రీ పూర్తిచేసినవారికీ జపాన్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా కెంజి ఒకు ముర మాట్లాడుతూ మానవ వనరుల కొరత కారణంగా జపాన్ ప్రభుత్వం 1.23 మిలియన్ల మంది విదేశీ కార్మికులను స్వీకరించే ప్రణాళికను రూపొందించిందని,జపాన్‌కు ప్రతి ఏటా సుమారు 5 లక్షల ఉద్యోగాలు అవసరం ఏర్పడిందని, జపాన్‌లో భారతీయులకు మంచిపేరు ఉందని, అక్కడి చట్టాలను గౌరవిస్తూ కష్టపడి పనిచేస్తారని నమ్మకం ఉందన్నారు. తప్పనిసరిగా జపనీస్ భాష నేర్చుకొని ఆతిథ్యరంగంలో డిగ్రీ సాధించిన లేక ఆన్లైన్‌లో డిగ్రీ చేస్తున్న వారికీ జపాన్‌లోని ప్రముఖ హోటళ్ల నుంచి కండిషనల్ ఆఫర్ లెటర్‌తో ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. సింగిరెడ్డి లక్ష్మిరవినాథ్ రెడ్డి మాట్లాడుతూ ఇంటర్ పూర్తయిన వెంటనే విద్యార్థులు ఫీజు చెల్లించే అవసరం లేకుండా పీఎం విద్యాలక్ష్మి పథకం(ఎడ్యుకేషన్ లోన్) ద్వారా పూర్తి ఫీజు సౌకర్యం కల్పిస్తున్నామని, మూడేళ్ల తర్వాత వాయిదా పద్ధతిలో లోన్ చెల్లించే వెసులుబాటు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జైకో ప్రతినిధులు యమవుకో, తానబే, హీరోనాక, ఒగవా పాల్గొన్నారు.

## జూన్‌లో 'హలో నేతకాని చలో హైదరాబాద్'

### తెలంగాణ నేతకాని విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు సాయిని ప్రసాద్ నేత

**చిక్కడపల్లి, ఏప్రిల్ 26 (ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన కులగణనలో నేతకాని కులానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ, తమ సత్తా చాటేందుకు జూన్ నెలలో "హలో నేతకాని చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలంగాణ నేతకాని విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు సాయిని ప్రసాద్‌నేత ప్రకటించారు. ఆదివారం బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వహించిన నేతకానీల రౌండ్ టేబుల్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన నేతకాని కుల సంఘాల చైర్మన్, రిటైర్డ్ ప్రొఫెసర్ జాడి ముసలయ్య, మాజీ చీఫ్ ఇంజనీర్ ముడిమడుగుల శంకర్ మాట్లాడుతూ ఉత్తర తెలంగాణలోని 17 జిల్లాల్లో, దాదాపు 40 నియోజకవర్గాల్లో 12 లక్షలకు పైగా జనాభా ఉన్న నేతకానీలను లెక్కల్లో లేకుండా చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది నేతకానీలను అన్ని రంగాల్లో అణచివేయడానికి ప్రభుత్వం చేసిన కుట్రగా వారు అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ఈ ద్రోహాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామని హెచ్చరించారు.మే నెలలో గ్రామ స్థాయి నుంచి మండల కేంద్రాల వరకు నిరసన ర్యాలీలు, తహసీల్దార్లకు వినతి పత్రాల సమర్పణ, జూన్ మొదటి వారంలో జిల్లా కలెక్టరేట్ల ఎదుట భారీ నిరసన ప్రదర్శనలు, జూన్ మూడో వారంలో రాష్ట్ర రాజధానిలో లక్షలాది మందితో 'హలో నేతకాని చలో హైదరాబాద్' భారీ బహిరంగ సభ ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో నేతకాని సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుర్గం రాజేష్, ఉపాధ్యక్షులు దుర్గం వినోద్‌కుమార్, నాయకులు కోట రాజలింగు, బోర్లకుంట దీపక్ కుమార్, రత్నం రాజేష్, విద్యార్థి నాయకులు సాయిని సాయికుమార్, రామటెంకి శివ కార్తీక్, దూల్లే దినేష్, కొండగుర్ల పవన్, జాడి మోహన్ పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర కాంట్రాక్ట్ లేబర్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా జితేందర్

**చిక్కడపల్లి, ఏప్రిల్ 26 ( ప్రభాతవార్త) :** కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా చేపట్టాలని నిర్ణయించినట్లు భారతీయ మజ్దూర్ సంఘ్ అఖిల భారతీయ ప్రభారి కె.వి.రాధాకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూర్పు రామిరెడ్డి అన్నారు. ఆదివారం బిఎంఎస్ కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర కాంట్రాక్ట్ లేబర్ ఫెడరేషన్ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా న్యాయవాది జితేందర్, ప్రధాన కార్యదర్శిగా వరంగల్ జిల్లాకు చెందిన శ్రీ సుధాకర్ ఎన్నికయ్యారు. మొత్తం 25 మందితో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. కార్యనిర్వాహక అధ్యక్షులుగా చంద్రమోహన్, ఉపాధ్యక్షులుగా కుమారస్వామి, కరుణాకర్, రాఘవేందర్, శ్రీనివాస్ ఉన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. త్వరలో ఇందిరా పార్క్ వద్ద భారీ మహా ధర్నా నిర్వహించాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. కార్యక్రమంలో సంఘటన కార్యదర్శి రామ్మోహన్, ఆల్ ఇండియా టెక్మ మజ్దూర్ మహా సంఘ్ అధ్యక్షులు కంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐటి, హెచ్‌సియు, జీహెచ్ఎంసి, ఎంజీఎం, ఏఎస్ఎల్, డిఎస్ఆర్ఎల్, ఈఎస్ఐఎస్, బాసర ఐఐఐటి వంటి ప్రముఖ సంస్థల యూనియన్ ప్రతినిధులు, కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## కోదండరాంకు జన సమితి నేతల సత్కారం

**చిక్కడపల్లి, ఏప్రిల్ 26 (ప్రభాతవార్త):** శాసనమండలి సభ్యుడిగా (ఎమ్మెల్సీ) నియమితులైన తెలంగాణ జన సమితి (తజస) రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంను ఆ పార్టీ నేతలు ఆదివారం ఘనంగా సత్కరించారు. గ్రేటర్‌హైదరాబాద్ జన సమితి అధ్యక్షుడు ఎం.నరసయ్య ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో కోదండరాంకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పలువురు నేతలు ఆయనను కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నగర ప్రధాన కార్యదర్శి బట్టల రామచందర్, బీసీ జన సమితి కన్వీనర్ జస్వంత్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పల్లె వినయ్, రమేష్ ముదిరాజ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ధారసత్యం, కార్యాలయ ఇన్చార్జి హనుమంతరెడ్డి పాల్గొన్నారు. అలాగే నగర ఉపాధ్యక్షులు జయపాల్ రెడ్డి, లక్ష్మణ్, లీగల్ కన్వీనర్ సయ్యద్ ఇస్మాయిల్, నాయకులు భూషణం, సదానంద్, మాణిక్యం, కన్నయ్య తదితరులు పాల్గొన్న వారిలో ఉన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వానికి అవోపా కృతజ్ఞతలు

**చిక్కడపల్లి, ఏప్రిల్ 26 (ప్రభాతవార్త):** వాసవి మాత జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వానికి ఆర్య వైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(ఆవోపా) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.నమశివాయ, మడుపల్లి రవిగుప్త, కోశాధికారి మాకం బద్రీనాథ్ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం చిక్కడపల్లి ఆవోపా కేంద్ర కార్యాలయంలో వారు మాట్లాడారు. ఈనిర్ణయం ఆర్యవైశ్య సమాజపు సాంస్కృతిక వారసత్వానికి మాత్రమే కాకుండా, శ్రీ కన్యకా పరమేశ్వరి దేవి ఉపదేశించిన భక్తి, సేవ, సామాజిక సమానత్వం వంటి విలువలకు ప్రభుత్వ గుర్తింపుగా నిలిచిందన్నారు. వాసవి మాత జయంతిని రాష్ట్ర స్థాయి పండుగగా ప్రకటించడం ద్వారా లక్షలాది భక్తుల భావాలను గౌరవించినట్లు పేర్కొన్నారు.

# సేవాలాల్ మహారాజ్ గుడి నిర్మాణానికి భూమి,నిధులు కేటాయించాలి

## గిరిజన సంఘాల డిమాండ్



కరపత్రాన్ని విడుదల చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

**హైదరాబాద్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త**

హైదరాబాదులో సేవాలాల్ మహారాజ్ గుడి నిర్మాణానికి 100 ఎకరాల భూమి, 1000 కోట్ల నిధులు కేటాయించాలని లంబాడి హక్కుల పోరాట సమితి, గిరిజన విద్యార్థి సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసాయి. ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు అజ్మీరా పూల్ సింగ్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో లంబాడీల జనాభా మూడో స్థానంలో ఉందని జనాభా అనుగుణంగా లంబాడీల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు లంబాడి హక్కుల పోరాట సమితి, గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మే నెల 19న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటి ముందు నిరసన ధర్నా కార్యక్రమం ఉందని, అదే విధంగా 30న సెడక్ బంద్ శ్రీశైలం హైవేపై నిరసన కార్యక్రమం ఉంటుందని. జూన్ 15 కొండా రెడ్డిపల్లె నుండి మహాపాదయాత్ర కొనసాగి హైదరాబాద్ అమరవీరుల స్థూపం వద్ద ముగింపు ఉంటుందని పూల్‌సింగ్ వివరించారు. గిరిజన విద్యార్థి సంఘం జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు వెంకట్ బంజారా మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలో లక్షల కోట్లు కేటాయించి దేవాలయాలు నిర్మించారని ప్రతి గ్రామంలో దేవాలయాలు దర్శనమిస్తాయి కానీ లంబాడీల ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహారాజ్ దేవాలయాలకు ఎటువంటి నిధులు కేటాయించలేదని, శంషాబాద్ విమానాశ్రయం పక్కనే ఉన్న సమతా మూర్తి విగ్రహానికి ఎన్ని కోట్ల డబ్బులు కేటాయించారో ప్రజలకు తెలుసని వెంకట బంజారా వివరించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు నుండి దేవాలయాల అభివృద్ధి కొరకు వేల కోట్లు కేటాయించారని పేర్కొన్నారు.విలేకరుల సమావేశంలో గిరిజన విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మూడు బాలాజీ నాయక్, లంబడి హక్కుల పోడవు సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ సుధీర్ చక్రవర్తి, పరశురాం నాయక్, జైపాల్ నాయక్ మహిళా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పున్ని బాయి, ప్రధాన కార్యదర్శి దేవి బాయ్ గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వినోద్ నాయక్, ఎల్ హెచ్ పి ఎస్ మహిళ ఉపాధ్యక్షురాలు అచ్చిబాయి, మహబూబాద్ జిల్లా అధ్యక్షులు తేజావత్ మహేష్ నాయక్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు రాందాస్ నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అంజి నాయక్, భాస్కర్ నాయక్,జివిఎస్ రాష్ట్ర లీగల్ అడ్వైజర్ ఇస్లావత్ హతిర్నా నాయక్, పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం

**చిక్కడపల్లి, ఏప్రిల్ 26 (ప్రభాతవార్త )**

ప్రతి ఒక్కరూ సామాజిక సేవా దృక్పథంతో ముందుకు రావాలని సామాజికవేత్త సూర్యభాయ్ పిలుపునిచ్చారు. ఆదివారం శ్రీరేణుక ఎల్లమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఆరోగ్య వైద్యశిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 50 మంది దివ్యాంగ కుటుంబాలకు రూ.4,000నగదు సహాయం అందజేయడంతో పాటు నిత్యావసర సరుకులను పంపిణీ చేసి మాట్లాడుతూ, దివ్యాంగుల స్వయం ఉపాధి కోసం త్వరలో పేపర్ ప్లేట్లు, గ్లాసుల తయారీ యంత్రాలను అందజేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వికలాంగుల మ్యానిఫెస్టో సాధన సమితి చైర్మన్ నాగభూషణం, మరగుజ్జు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లేష్, ఫౌండేషన్ చైర్మన్ వల్లాల రేణుక సుధాకర్, సమన్వయకర్త అరుణ పాల్గొన్నారు.


IN THE COURT OF THE HON'BLE XXI JUNIOR CIVIL JUDGE, C.C.C., AT: HYDERABAD
O.S. No. 977 OF 2026
BETWEEN:
Valluri Sri Chandana & Another ...Plaintiffs
AND
Tahsildar, Khairathabad Mandal & Others ...Defendants
To
THE ALL CONCERNED
Please take notice that the Plaintiffs filed the above suit to declare them as Legal Heirs of Late Valluri Dattatreya Uma Sanker, in which the Hon'ble Court has directed for issuance of paper notice to ALL CONCERNED (D-2). Thus if anyone having objections in the above matter are hereby called to attend the Hon'ble Court on **06-05-2026 at 10.30 A.M.** in person or through Counsel, without fail, otherwise the matter would be decided as per law.
By Order of the Court.
Sd/- K.S. PHANI BHASKAR
ADVOCATE
Off: 1st Floor, H.No. 4-3-148/1, Pillar No. 122, Attapur, R.R. Dist.
(M): 9848138990, 7989606882



వీరబ్రహ్మేంద్ర ఆలయ భూమి పూజలో పాల్గొన్న మహేందర్‌రెడ్డి

## ఆలయానికి భూమి పూజ

**పెద్దేముల్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** అధ్యాత్మిక వాతావరణంతోపాటు సామాజిక ఐక్యతకు ఆలయాలు కేంద్రాలుగా నిలుస్తాయని ప్రభుత్వ చీఫ్‌విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పెద్దేముల్ మండలం కందనెల్లిగుట్టపై శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ శంకుస్థాపన మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై భూమి పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ఆలయ స్థలం కోసం తాను రూ. 10 లక్షలు విరాళం అందించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం తన ఎంఎల్‌సి నిధుల నుంచి ఆలయ నిర్మాణానికి రూ. 50 లక్షలు అందిస్తామని ప్రకటించారు. విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం నేతలతో కలిసి అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్ర మంలో టీపీపీసీ సమన్వయకర్త కరణం పురుషోత్తంరావు, సర్పంచ్ యాదమ్మశ్రీనివాస్, ఉపసర్పంచ్ వాజిద్, మాజీ యం పిటిసి మధులత శ్రీనివాస్‌చారీ, సంఘ అధ్యక్షులు పాండురంగ చారీ, కార్యదర్శి బాలు చారి పాల్గొన్నారు.

**శ్రీవారి ఆలయ అభివృద్ధికి సహకరించాలి**

శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించడం అభినందనీయమని ఆలయ పౌండర్ బిచ్చప్ప అన్నారు. ఖాంజాపూర్ గుట్ట సమీపంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ సన్నిదిలో డబుల్‌బెడ్ రూమ్ కాంట్రాక్టర్లు అమర్‌నాథ్‌రెడ్డి, ఆశన్నలు సిమెంట్ బెడ్ వేయించారు. ఈ సందర్భంగా ఆలయ పౌండర్ బిచ్చప్ప మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి గ్రామ ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. దాతల సహకారంతో ఆలయానికి కొత్త వెలుగులు రానున్నాయన్నారు. మరింతమంది దాతలు సమాజసేవకు, ఆలయాల అభివృద్ధికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.



సహాయం అందజేస్తున్న కౌన్సిలర్ అర్చన

## ఆడబిడ్డ వివాహానికి చేయూత

**మేడ్చల్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** ఓ పేదింటి ఆడబిడ్డ వివాహానికి ఎల్లంపేట్ మున్సిపల్ 24వ వార్డు కౌన్సిలర్ అర్చన శ్రీనివాస్ పుస్తె, మట్టెలతోపాటు రూ. 25 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మున్సిపల్ పరిధి ఎల్లంపేట గ్రామానికి చెందిన రాగం పద్మశ్రీనివాస్‌ల కుమార్తె ప్రవళిక వివాహ నిశ్చయం అయ్యింది.

## ఇంటి నిర్మాణానికి సిమెంట్ పంపిణీ

**తలకొండపల్లి ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల కేంద్రంలో నిరుపేద ఇంటి నిర్మాణం కోసం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ నుంచి ఉచితంగా సిమెంటు పంపిణీ చేశారు. తలకొండపల్లి సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్, ఉపసర్పంచ్ కోటే శ్వర్ లఆధ్వర్యంలో గ్రామానికి చెందిన రవి ఇంటి నిర్మాణం కోసం ఆర్థిక స్థోమత లేకపోవడంతో అతనికి ఆదివారం నాడు ఉప్పల ట్రస్ట్ నుంచి ఉచితంగా సిమెంటును అందజేశారు. ఈ సందర్భంగా



ఆయన మాట్లాడుతూ ఉప్పల ట్రస్ట్ నుంచి ఎంతో మంది నిరుపేదలకు ఉచిత విద్యకు, కార్పొరేట్ ఆసుపత్రి కోసం వైద్య సహాయం, నిరుపేదల ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు వారు తెలిపారు. తలకొండపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో ఉప్పల ట్రస్ట్ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా శేఖర్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శేఖర్ యాదవ్ ఉప సర్పంచ్ కోటీశ్వర్, వార్డు సభ్యులు వెంకటేష్ యాదవ్ పోతుగంటి కుమార్, రవి కుమార్ పద్మ విటల్, కంటం మధు, బొజ్జం యాదయ్య, వెంకటయ్య, రమేష్ తదితరులు ఉన్నారు.

## కార్యకర్తలను కాపాడుకుంటాం

**కుల్కచర్ల, ఏప్రిల్, 26 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను పార్టీ కంటికి రెప్పల కాపడుకుంటుంని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. గత అదివారం మండల కేంద్రంలోని పిఎసిఎస్ అవరణలో డ్రోన్ ప్రారంభోత్సవంలో డ్రోన్ అపరేటింగ్ మిస్ ద్వారా కాంగ్రెస్ పార్టీ మాజి అధ్యక్షుడు వెంకటయ్య గౌడ్ కాలుకు రాంపూర్ సర్పంచ్ చెక్కల తిరుపతయ్య చేతి వెలుకు సల్ప గాయాలు కావడంతో అదివారం డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు భీంరెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ ఆంజనేయులుతో కలిసి వెంకటయ్య గౌడ్‌ను,సర్పంచ్ చెక్కల తిరుపతయ్య పరమర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి గోపాల్ నాయక్, మాజి ఎంపిటిసి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు: కలెక్టర్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :** అహర్హులైన జర్నలిస్టులకు త్వరలోనే అక్రిడేషన్ కార్డులు అందజేస్తామని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు నూతన మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అర్హులైన వారికి అక్రిడేషన్ కార్డులు జారీ చేయాలని, జిఓ నెం.252 ప్రకారం నిబంధనలు పాటించాలన్నారు. మీడియా ప్రతినిధులు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించి మీడియా వ్యవస్థ పై ప్రజల నమ్మకాన్ని పెంపొందించాలని అన్నారు. సమావేశంలో సభ్యులు తమ అభిప్రాయాలు, సూచనలు కలెక్టర్‌కు తెలియజేశారు. ఈ సమావేశంలో డీపీఆర్ఓ చెన్నమ్మ, కమిటీ సభ్యులుగా శెట్టి రవిశంకర్, మల్లేశం, రఘు, ప్రహ్లాదచారి, పాపి రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



అక్రిడేషన్ కమిటీ సభ్యులతో సమావేశమైన కలెక్టర్ దీపక్ తివారి

## పట్టాలకెక్కుతున్న అభివృద్ధి పనులు

**జిల్లెడు చౌదరిగూడ, ఏప్రిల్, 26 ప్రభాతవార్త:** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని చౌదరిగూడలో అభివృద్ధి పనులు పట్టాలకెక్కుతున్నాయి. ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు సర్పంచ్ శ్వేత చంద్రబాబుగౌడ్ కృషి చేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం నుంచి సిసి రోడ్ల ఏర్పాటుకు రూ.30లక్షలు, అంతర్గత మురుగు కాలువల నిర్మాణానికి రూ.12లక్షలు విడుదల అయ్యాయి. రూ.10 లక్షలతో నిర్మిస్తున్న మహిళ సమాఖ్య భవనం, రూ.12 లక్షలతో నిర్మిస్తున్న అంగన్‌వాడి భవనం పనులు చురుగ్గా సాగుతున్నాయి. గ్రామంలో వీధి లైట్ల సమస్య పరిష్కారానికి కొత్తగా 36 విద్యుత్ స్తంభాలు, వివిధ కాలనీలలో ఐదు హైమాక్స్ లైట్లు ఏర్పాటు చేశారు. బీసి కాలని నుంచి కమ్మరిపేట, మంగలి గెరి నుంచి కమ్మరిపేట, కమ్మరిపేట నుంచి వెంచర్ వరకు మట్టి పోయించి రోడ్డు పనులు చేపట్టారు. చౌదరిగూడ గ్రామ పంచాయితీని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు మరిన్ని నిధులు అవసరమని సర్పంచ్ శ్వేత చంద్రబాబుగౌడ్ తెలిపారు. గ్రామంలో అనేక సమస్యలు ఉన్నాయని, ప్రాధాన్యత క్రమంలో ఒక్కొకటిగా పరిష్కరిస్తున్నామని వివరించారు.



అంతర్గత మురుగుకాలువ పనుల దృశ్యం

## సర్పంచ్‌పై దాడి ఘటనలో దోషులను శిక్షించాలి

**జిల్లెడు చౌదరిగూడ, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఎల్కగూడ గ్రామ సర్పంచ్‌పై దాడి చేసిన వ్యక్తులను కఠినంగ శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పేద కుటుంబానికి చెందిన సర్పంచ్ బందయ్యపై అగ్రకులానికి చెందిన ఓ వ్యక్తి పథకం ప్రకారం దాడి చేయించారని ఆరోపించారు. గ్రామ సర్పంచ్‌గా బందయ్య ఎన్నిక కావడం జీర్ణించుకోలేక అతనిపై హాత్యాయత్నం చేశారని ఆరోపించారు. సమావేశంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షురాలు శ్వేత, సర్పంచ్‌లు చంద్రశేఖర్, జంగయ్య, చందునాయక్, రాంచంద్రయ్య, నర్సింహులు, నీలయ్య, నాయకులు శివమౌళి, సత్యం, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చలివేంద్రంపల్లి రాజు



ఆమనగల్లు అంబేద్కర్ సంఘం నూతన కార్యవర్గం

## అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీ ఎన్నిక

**ఆమనగల్లు, ఏప్రిల్26, ప్రభాతవార్త:** ఆమనగల్లు అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా లండం చిన్న జంగయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఆమనగల్లు పట్టణంలో సంఘం ఫౌండర్ వంకేశ్వరం భీమయ్య అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈమేరకు నూతన కమిటీని ఎనుకున్నట్లు ఆయన తెలిపారు. అధ్యక్షుడిగా లండం చిన్నజంగయ్య, ఉపాధ్యక్షులుగా వస్పుల సురేష్, వస్పుల రంజిత్, ప్రధాన కార్యదర్శిగా నాగిళ్ల లక్ష్మణ్, మీసాల రమేశ్, పుల్లారెడ్డి శ్రీశైలం, సహకార్యదర్శిగా ఎండీ అప్సర్, యడవల్లి రమేశ్, కోశాధికారిగా లండం గిరి, నేనవాత్ పవన్, సెక్రటరీ పాత్లావత్ రవి, మద్దేల నరేశ్, యువజన విభాగం సమన్వయ కర్తలుగా వడ్డెమోని శివకుమార్, తలారి శివకుమార్, వస్పుల శంకర్ తదితరులు ఉన్నారు. ఈసందర్భంగా నూతన అధ్యక్షుడు లండం చిన్నజంగయ్య మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలు సాధించటానికి, ఆయన సిద్ధాంతాలు ప్రజల్లోకి తీసుకువెళ్లటానికి కృషి చేస్తానన్నారు.



## స్నేహితుని కుటుంబానికి రూ. లక్ష సహాయం

**తలకొండపల్లి ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** చిన్ననాటి స్నేహితుడు మృతితో కలత చెందిన మిత్రబృందం మానవత్వంతో బాధితుని కుటుంబానికి బాసటగా నిలిచింది. తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన బురముని నరసింహ ఈనెల 6న అనారోగ్యానికి గురై మృతి చెందాడు. నర్సింహకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఆ కుటుంబానికి 2000-01 సంవత్సరంలో పదవ పదవ తరగతి బ్యాచ్ బృందం స్వచ్ఛందంగా లక్ష రూపాయలు అందజేసింది. చిన్న వయసులో అనారోగ్యానికి గురై మృతి చెందడం అతని కుటుంబానికి తీరని లోటుని స్నేహితులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వారిని అభినందించారు.



పారిశుధ్య సిబ్బందితో కలిసి రోడ్లను శుభ్రం చేస్తున్న కాలనీ అధ్యక్షుడు మన్యం

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరు తమ ఇంటితో పాటు పరిసరా ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని సుప్రభాత్ టౌన్‌షిప్ కాలనీ అధ్యక్షుడు గొబ్బరి మన్యం అన్నారు. పోచారం డివిజన్ కొర్రెముల పరిధిలోని సుప్రభాత్ టౌన్‌షిప్‌లో ఆదివారం స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా కార్పోరేషన్ పారిశుధ్య సిబ్బందితో కలిసి రోడ్లను ఊడ్చి శుభ్రం చేశారు. భారత ప్రభుత్వం 94 రోజుల స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా కాలనీలో చీపుర్లు చేతపట్టి పారిశుధ్య సిబ్బందితో కలిసి రోడ్లను ఊడ్చారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు మాట్లాడుతూ పచ్చదనం, పరిశుభ్రతపై ప్రతి ఒక్కరికి అవగాహన ఎంతో అవసరమని అన్నారు. గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా గ్రామాలు, పట్టణాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు జి. మన్యం, సభ్యులు బంగారి రాజయ్య, టి. హరనాథ్, యం. రాజనర్సు, ఎస్. లక్ష్మీనారాయణ, వెంకట్‌రెడ్డి, చుక్కల నర్సయ్య, బి. మల్లయ్య, సర్జిత్ సింగ్, ఆలయ పూజారి బాస్కర శర్మ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పొన్నంకు స్వాగతం పలుకుతున్న ఆమనగల్లు కాంగ్రెస్ నేతలు

## కల్వకుర్తి డిపోకు అదనంగా 20 కొత్త బస్సులు

**ఆమనగల్లు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆమనగల్లు పట్టణంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. హైదరాబాదు నుండి శ్రీశైలం వెళుతున్న పొన్నం ఆదివారం ఆమనగలు పట్టణంలో కొద్దిసేపు ఆగారు. టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికి మంత్రికి స్వాగతం పలికారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెను విరమింపజేయడంలో మంత్రి చూపిన చొరవను కొనియాడుతూ ఆయనను సత్కరించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరిక మేరకు కల్వకుర్తి డిపోకు అదనంగా 20 కొత్త బస్సులు కేటాయించినట్లు ఈ సందర్భంగా మంత్రి పొన్నం వెల్లడించారు. బీసీ సంక్షేమ శాఖ నుంచి కల్వకుర్తి నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, మైసిగండి మైసమ్మ దేవాలయం వద్ద ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు చేయాలని శ్రీనివాస్ గౌడ్ మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో యువజన కాంగ్రెస్ తాలూకా ఉపాధ్యక్షుడు షాబుద్దీన్, నాయకులు యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, ఖరీమ్, సురేష్, అలీమ్ తదితరులు ఉన్నారు.

## ఫ్యూచర్ సిటీతో కందుకూరుకు ఉజ్వల భవిష్యత్తు

**కందుకూరు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** పేదవాడికి సొంత ఇంటి కల నెరవేర్చుతున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కందుకూరు మండలం దెబ్బడగూడ గ్రామంలో స్థానిక సర్పంచ్ మల్లేపల్లి బాలరాజ్, మాజీ సర్పంచ్ ఏనుగు శ్రావణి ఇలా ఆధ్వర్యంలో ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ సభావత్ కృష్ణా నాయక్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జంగారెడ్డి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం పేదవాడి ఇంటికలను దూరం చేసిందని విమర్శించారు. మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కిచెన్ గారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో దెబ్బడగూడ గ్రామానికి 61 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కావడం జరిగిందని ఇందులో చాలావరకు నిర్మాణాలు పూర్తిచేసుకుని గృహప్రవేశాలు నిర్వహించుకుంటుంటం అభినందనీయమన్నారు. నేడు కాంగ్రెస్ పాలనలో ఈ ప్రాంతానికి మంచి భవిష్యత్తు రాబోతోందని ఫ్యూచర్ సిటీ ఈ మండల పరిధిలోనే ఏర్పాటు కాబోతుందని దానికి ప్రత్యేక ప్రణాళికలు రాష్ట్ర ప్రభుత్వం రూపొందిస్తోందని, రాబోయే రోజుల్లో ఈ ప్రాంతానికి మంచి భవిష్యత్తు ఉంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో మండల మాజిక్ ఆప్షన్స్ సభ్యులు సులేమాన్ వాడు మెంబర్లు ఆంజనేయులు, కందడి నరేష్, డి మమతా భాస్కర్, శ్వేతా విక్రం రెడ్డి, పి శేఖర్‌తో పాటు ఇందిరమ్మ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు అధికారులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న టిపిసిసి ప్రధాన కార్యదర్శి జంగారెడ్డి



వాసవీ మాత జయంతి కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్

## కలెక్టరేట్‌లో వాసవీ మాత జయంతి

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న వాసవి మాత జయంతి ఉత్సవాలను వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ సమావేశం హాలులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఏటా ఈ ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించగా...క్రీడాల అభివృద్ధి శాఖ అధికారి సత్తార్, వైశ్య సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 4,230మంది రైతులకు రుణ మాఫీ

**జిల్లెడు చౌదరిగూడ, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీతో జిల్లెడు చౌదరిగూడ మండలంలోని 4,230మంది రైతులకు ప్రయోజనం చేకూరింది. మండల వ్యాప్తంగా రూ.34 కోట్ల 83లక్షల 74 వేల 217 విడుదల చేయటంతో అన్నదాతలు వ్యవసాయ రుణాల నుంచి విముక్తి పొందారు.

## డిజె నిర్వాహకులపై కేసు నమోదు

**కేశంపేట, ఏప్రిల్ 26 ప్రభాతవార్త :** ఎలాంటి అనుమతులు లేకుండా సౌండ్ పొల్యూషన్ చేస్తున్న డిజె నిర్వాహకులు శివ, ఆపరేటర్ ముస్రాఫ్‌పై కేసు నమోదు చేసినట్లు సిఐ నరహరి తెలిపారు. కేశంపేట మండల పరిధిలోని నిర్దావెల్లి గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున 1:30 గంటల ప్రాంతంలో డీజే బృందాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రజలకు ఎవరు అసౌకర్యం కల్పించినా కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ తెలిపారు.



ఎమ్మెల్సీ కోదండరాంను సన్మానిస్తున్న యాదిలాల్

## ఎమ్మెల్సీ కోదండరామ్‌కు సన్మానం

**ఆమనగల్లు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమ జేఏసీ కన్వీనర్, ఎమ్మెల్సీ కోదండరాంను ఆమనగల్లు బార్ అసోషియేషన్ అధ్యక్షులు అండేకర్ యాదిలాల్ సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కోదండరాం పాత్రను కొనియాడుతూ ఎమ్మెల్సీ పదవితో ఆయన తగిన గుర్తింపు లభించిందని యాదిలాల్ హర్షం తెలిపారు. ఆదివారం గ్రంథాలయ సంస్థ కార్యదర్శి గణేష్ గౌడ్‌తో కలిసి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలుసుకున్నారు.



సాయం అందిస్తున్న డిప్యూటీ కమిషనర్ వెంకట్‌రామ్ దంపతులు

## అనాథ చిన్నారులకు ఆసరా

**ఆమనగల్లు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** తల్లిదండ్రులు, తోబుట్టువులను కోల్పోయి అనాథలుగా మారిన ముగ్గురు చిన్నారులను జల్‌పల్లి మున్సిపాలిటీ డిప్యూటీ కమిషనర్ వెంకట్‌రామ్ అక్కున చేర్చుకుని మానవత్వాన్ని చాటారు. ఆమనగల్లు మండలం సీతారంనగర్ తండా పరిధిలోని పులిగోనిపల్లి తండాకు చెందిన రాందాసునాయక్ తన భార్య, ఇద్దరు చిన్నారులను హత్య చేసి రిమాండ్‌పై జైలుకు వెళ్ళి అక్కడ ఆయన ఫిట్స్ వ్యాధితో మరణించిన విషయం తెలిసిందే. దీంతో ఆకుటుంబంలో మిగిలిన ముగ్గురు ఆడపిల్లలు అనాథలుగా మారి పోయారు. ప్రస్తుతం వారి జీవనం గడ్డు స్థితిలో ఉండడంతో జల్‌పల్లి మున్సిపాలిటీ డిప్యూటీ కమిషనర్ వెంకట్ రామ్ తన సతీమణి రాజేశ్వరితో కలిసి ఆదివారం తండాలో బాధిత చిన్నారులను కలుసుకుని తన ఔదార్యాన్ని ప్రదర్శించారు. బాధితులకు రూ. 25వేలు నగదు, మూడు క్వింటాళ్ల బియ్యం, నిత్యవసర సరుకులు అందజేశారు. ఈసందర్భంగా తండావాసులు ఆదంపతులను అభినందించారు.



పరామర్శిస్తున్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి

## సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

**ఆమనగల్లు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** ఆమనగల్లు మండలం శంకర్‌కొండతండా సర్పంచ్, కాంగ్రెస్‌పార్టీ మాజీ మండలాధ్యక్షుడు మండ్లీ రాములుకు ఆదివారం పితృవియోగం కలిగింది. అతని తండ్రి మండ్లీ అంజయ్య అనారోగ్యంతో కన్నుమూసారు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి శాసనసభ్యుడు కసిరెడ్డి నారాయణరెడ్డి, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డితోపాటు పలువురు ప్రముఖులు మృతుని పార్థివదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. సర్పంచ్ రాములుకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మండల పార్టీ అధ్యక్షుడు తెల్గుమళ్ల జగన్‌తోపాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## మంత్రుల మేలు మరువలేం

**మేడ్చల్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** మేడ్చల్ బస్ డిపో కార్మికులు ఆదివారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్మిక శాఖ మంత్రి వివేక్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. తెలంగాణ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపకుడు అశ్వథామరెడ్డితో కలిసి వెళ్లిన నాయకులు మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రుల మేలు మరిచిపోలేమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.



మంత్రి పొన్నంను కలిసిన మేడ్చల్ డిపో కార్మిక నాయకులు

# ఉద్యోగ సాధనకు ఉచిత శిక్షణా విప్లవం

### గ్రామీణ యువతకు భరోసాగా సుంకిరెడ్డి

**రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** గ్రామీణ నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో అండగా నిలుస్తూ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి చేపడుతున్న కార్యక్రమాలు విశేష ఆదరణ పొందుతున్నాయి. కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్, తలకొండపల్లి, కడ్తాల్, మాడ్గుల మండల కేంద్రాల్లో ఎస్సై, కానిస్టేబుల్ ఉచిత శిక్షణ కేంద్రాలను ప్రారంభించి గ్రామీణ యువతలో కొత్త ఆశలు నింపారు. పోలీస్ ఉద్యోగం సాధించాలనే కల ఉన్నా ఆర్థిక ఇబ్బందులు, సరైన శిక్షణా వసతుల లేమితో వెనుకబడుతున్న యువతకు ఈ కేంద్రాలు ఒక వరంగా మారనున్నాయి.

**సేవా దృక్పథంతో ముందుకు..**

సామాజిక సేవను లక్ష్యంగా పెట్టుకుని యువత భవిష్యత్తు కోసం సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం విశేషంగా ప్రశంసలు అందుకుంటోంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభకు కొదవలేదని, కానీ అవకాశాల లేమే ప్రధాన సమస్యగా మారిందని గుర్తించిన ఆయన ఆ సమస్యకు పరిష్కారంగా మండల కేంద్రాల్లోనే ఉచిత శిక్షణ అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఉద్యోగం కోసం కష్టపడే ప్రతి యువకుడికి సరైన దిశానిర్దేశం, శిక్షణ, ప్రోత్సాహం అందించాలనే సంకల్పంతో ఈ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.

**పట్టుదలే విజయానికి మూలం**

ఈ సందర్భంగా మాట్లాడిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి గ్రామీణ నేపథ్యం, పేదరికం మన లక్ష్యాలకు అడ్డంకి కాకూడదు. అవకాశాన్ని అందిపుచ్చుకుని కష్టపడి సాధిస్తే పోలీస్ ఉద్యోగం సాధించడం అసాధ్యం కాదు. పల్లెల్లోని యువతలో ఉన్న ప్రతిభను వెలికితీయడమే మా లక్ష్యం అని స్పష్టం చేశారు. ఈ శిక్షణ కేంద్రాల ద్వారా రాబోయే రోజుల్లో వందలాది మంది యువత ఉద్యోగాలు సాధించి కుటుంబాలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు.

**ఉద్యోగ సాధనకు సమగ్ర శిక్షణ**

ఈ కేంద్రాల్లో కేవలం రాత పరీక్షకు మాత్రమే కాకుండా శారీరక దారుఢ్యం, పరుగు సాధన, మానసిక స్థైర్యం, క్రమశిక్షణ, మాక్ టెస్టులు వంటి అంశాలపై సమగ్ర శిక్షణ అందించనున్నారు. పట్టణాల్లో లక్షలు ఖర్చు పెట్టి పొందే శిక్షణను గ్రామీణ యువతకు ఉచితంగా అందించడం ద్వారా సుంకిరెడ్డి ఒక సామాజిక ఉద్యమానికి శ్రీకారం చుట్టినట్టే అయిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**గ్రామీణ యువతలో నూతనోత్సాహం...**

ఈ శిక్షణ కేంద్రాల ప్రారంభంతో కల్వకుర్తి నియోజకవర్గంలోని యువతలో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. ఉద్యోగ సాధనపై ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు, కష్టపడితే లక్ష్యం చేరుకోవచ్చునే నమ్మకం బలపడుతోంది. సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి చేపట్టిన ఈ కార్యక్రమం గ్రామీణ యువత భవిష్యత్తును మలిచే దిశగా కీలక అడుగుగా




మాట్లాడుతున్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



క్రీడా శిక్షణా శిబిరంలో పాల్గొన్న యువకులు